ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 44.0
కనిష్ఠం : 25.0

నేడే నోటిఫికేషన్


- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- స్వేచ్ఛగా ఎన్నికలు సాగాల్సిందే
- అభ్యర్థులు నియమావళి పాటించాల్సిందే
- మీడియాతో కలెక్టర్, ఎస్పీ స్పష్టీకరణ



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ఏలూరు సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ వెల్లడించారు. అభ్యర్థులంతా ఎన్నికల సంఘం జారీ చేసిన నియమావళికి లోబడే నామినేషన్లు దాఖలు చేయాలని, దీనిపై వారికి అవగాహన వచ్చేలా అధికారులను అందుబాటులో ఉంచామని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎస్పీ మేరీ ప్రశాంతి, జేసీ లావణ్యవేణి, డీఆర్వో పుష్పమణితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏమన్నారంటే.. 'గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల అవుతుంది. అదేరోజు నుంచి నామినేషన్ స్వీకరణ ఆరంభం. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నిర్దేశించిన కార్యాలయాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆయా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్‌ల ఉపసంహరణకు చివరి తేదీ. అదేరోజు నామినేషన్ల తుది జాబితాను ప్రకటిస్తాం. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతాయి. నియోజకవర్గ కేంద్రంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాల్లోనే ఎమ్మెల్యే అభ్యర్థులకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ దాఖలు విధానంపై రాజకీయ పార్టీకి చెందిన ఒక్కొక్కరికి శిక్షణ అందించాం. నామినేషన్ దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయ పరిధిలో 100 మీటర్లలోపు అభ్యర్థికి చెందిన మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఇస్తాం. పార్లమెంట్, అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశాం. అభ్యర్థులు గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేయవచ్చు. పార్లమెంటరీ నియోజకవర్గం కోసం ఫారం -2(ఏ) అసెంబ్లీ నియోజక వర్గం కోసం ఫారం - 2(బి) సమర్పించాలి. పార్లమెంట్ నామినేషన్ దరఖాస్తుకు రూ.25 వేలు, అసెంబ్లీకి రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలి. మంచంమీద ఉన్న నడవలేని స్థితిలో ఉన్న వారిని గుర్తించి వారి ఇళ్ల వద్దకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ వేసేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. హోం ఓటింగ్ పేరిట వృద్ధులు, దివ్యాంగులకు ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి. వీరంతా కలిసి జిల్లాలో సుమారు 22 వేలు ఉండవచ్చు. అభ్యర్థులు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే ప్రచారం చేసుకోవాలి' అని వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ 'ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నాం. ప్రచారంలో వ్యక్తిగత దూషణలు చేయరాదు. ప్రచారానికి రమ్మని తమకే ఓటు వేయాలని ఎవర్నీ భయభ్రాంతులకు గురి చేయరాదు. అలాచేస్తే కేసు నమోదు చేస్తాం. ప్రజలను గందరగోళంలో నెట్టేలా ఎలాంటి ప్రచారం జరగకూడదు' అని స్పష్టం చేశారు. జేసీ మాట్లాడుతూ 'ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహణకు అనుమతులు తీసుకోవాలి. కార్యక్రమాలను పాఠశాలలు, మతపరమైన ప్రదేశాల్లో నిర్వహించ కూడదు. అభ్యర్థులు సువిధ పోర్టల్ ద్వారా నామినేషన్ సమర్పించవచ్చు' అని పేర్కొన్నారు.



కూటమి అభ్యర్థులు వీరే..

ఏలూరు-బడేటి చంటి, ఉంగుటూరు- పత్సమట్ల ధర్మరాజు, నూజివీడు-కొలుసు పార్థసారథి, కైకలూరు-డాక్టర్ కామినేని శ్రీనివాస్, పోలవరం- చిర్రి బాలరాజు, చింతలపూడి-సొంగా రోషన్‌కుమార్, దెందులూరు-చింతమనేని ప్రభాకర్

వైసీపీ అభ్యర్థులు..

ఏలూరు-ఆళ్ల నాని, ఉంగుటూరు-పుప్పాల వాసుబాబు, దెందులూరు- కొఠారు అబ్బయ్య చౌదరి, పోలవరం-రాజ్యలక్ష్మి, కైకలూరు-దూలం నాగేశ్వరరావు, నూజివీడు - మేకా ప్రతాప్ అప్పారావు, చింతలపూడి-విజయ్‌రాజు

కాంగ్రెస్ అభ్యర్థులు

ఏలూరు-బండి వెంకటేశ్వరరావు (సీపీఐ), ఉంగుటూరు-హరికుమార్‌రాజు, దెందులూరు-ఆలపాటి నరసింహమూర్తి, పోలవరం-డి.సృజన, చింతలపూడి- ఉన్నమట్ల ఎలీజా, కైకలూరు-బొడ్డు నోబుల్, నూజివీడు- మరీదు కృష్ణ

ఎంపీ అభ్యర్థులు..

1. కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్
2. కారుమూరి సునీల్‌కుమార్ (వైసీపీ)
3. కావూరి లావణ్య (కాంగ్రెస్)



నామినేషన్ల సమయం

ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు. ఎంపీ అభ్యర్థులు నామినేషన్లకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు. ఎమ్మెల్యే అభ్యర్థులకు.. నియోజకవర్గ కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లోనే..

ఎవరు..? ఎప్పుడు ?

నామినేషన్‌లకు ముహూర్తాలు ఖరారు



ఏలూరు రూరల్/పెదవేగి/నిడమర్రు/ బుట్టాయగూడెం/నూజివీడు/కైకలూరు/చింతలపూడి, ఏప్రిల్ 17 : పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. ఏలూరు పార్లమెంట్‌తో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్ల స్వీకరణ ఈ రోజు మొదలై ఈనెల 25వ తేదీ వరకు కొనసాగనుంది. వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు తగిన ముహూర్తాలను పెట్టుకుంటున్నారు.

- ఏలూరు వైసీపీ అభ్యర్థి ఆళ్ల నాని గురువారం ఉదయం 8.30 గంటలకు క్యాంప్ కార్యాలయం నుంచి పాదయాత్రగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేస్తారు. కూటమి తరపున టీడీపీ అభ్యర్థి బడేటి చంటి 23న నామినేషన్ వేస్తారు.
- దెందులూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తి గురువారం ఉదయం 11 గంటలకు, వైసీపీ అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి 19వ తేదీ ఉదయం 11 గంటలకు, కూటమి తరపున టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ 22న నామినేషన్లు వేయనున్నారు.
- ఉంగుటూరు కాంగ్రెస్ నుంచి పాతపాటి హరికుమార్ రాజు 22న, కూటమి తరపున జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు 23న, వైసీపీ తరపున పుప్పాల శ్రీనివాసరావు 25న నామినేషన్లు దాఖలు చేయనున్నారు.
- పోలవరం కూటమి తరపున జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు గురువారం, వైసీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి 24న, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అభ్యర్థి సరియం రామ్మోహన్ 22న నామినేషన్లు వేయనున్నారు.
- నూజివీడు మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా 18న, వైసీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తొలిసెట్‌ను 19న, రెండోసెట్ 23న, కూటమి తరపున టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి కొలుసు పార్థసారథి 24న నామినేషన్ దాఖలు చేయనున్నారు.
- కైకలూరు వైసీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు ఈ నెల 22న ఉదయం 10.30 గంటలకు, కూటమి తరపున టీడీపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ 23న ఉదయం 10.43 నిమిషాలకు నామినేషన్ వేయనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డు నోబుల్ నామినేషన్ తేదీ ఖరారు కాలేదు.
- చింతలపూడి : చింతలపూడి కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నమట్ల రాకాడ ఎలీజా 19న, వైసీపీ అభ్యర్థి కంభం విజయ్‌రాజు 20వ తేదీన 10.35 నిమిషాలకు, కూటమి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ 22వ తేదీన 10.45 నిమిషాలకు నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

అన్నిపక్షాల్లోనూ ఒకే టెన్షన్

మిత్రపక్ష కూటమి పరస్పర సహకారం.. అధికార వైసీపీ ఎత్తుగడే వేరు

సాధారణ ఎన్నికలకు వీలుగా నామినేషన్ల పర్వం నేటినుంచి ఆరంభం. ఇప్పటికే ప్రధాన పక్షాల్లో నువ్వానేనా అన్నట్లుగా ప్రచారసరళి సాగింది. వ్యక్తిగత దూషణలు పక్కన పెట్టి ప్రధాన పార్టీల అధినేతలే టార్గెట్‌గా సీఎం జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్ చుట్టూనే ప్రచార సరళి సాగింది. ఎన్నికల షెడ్యూల్ గతనెలలోనే విడుదలైంది. ఇక నామినేషన్‌లకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రతిపక్ష తెలుగుదేశం ఇప్పటికే ఏలూరు జిల్లా వ్యాప్తంగా తన అభ్యర్థులను మోహరించింది. నువ్వానేనా అన్నట్లుగా అధికార పక్షంతో వీరంతా నేరుగానే ఢీకొంటున్నారు. ఏలూరు లోక్‌సభ స్థానానికి తెలుగు దేశంకు చెందిన జనసేన, బీజేపీ బలపరిచిన కూటమి అభ్యర్థిగా పుట్టా మహేష్ కుమార్‌ను రంగంలోకి దింపారు. రాజకీయాలకు కొత్త అయినా వ్యూహరచనలో దిట్టగా పేరొందిన మహేష్‌కుమార్ యాదవ్ ఇప్పటికే లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలను చుట్టుముట్టారు. నామినేషన్ వేసేందుకు వీలుగా ఆయన తగిన ముహూర్తం ఖరారు చేస్తున్నారు. ఇక ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థులు, మిత్రపక్ష కూటమి తరపున ఇప్పటికే రంగంలో ఉన్నారు. ఏలూరు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం బలపరిచిన కూటమి అభ్యర్థిగా బడేటి చంటి, గడపగడపకు వెళుతూ ఓటర్లను కలుస్తున్నారు కైకలూరు నుంచి బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. ఆయన తన ప్రధాన ప్రత్యర్థి వైసీపీకి చెందిన దూలం నాగేశ్వరరావుతో ఢీకొనేలానే ప్రచారం చేసి ఇప్పుడు నామినేషన్ దిశగా ముందుకు సాగుతున్నారు. నూజివీడు నియోజకవర్గంలో మాజీ మంత్రి కొలుసు పార్థసారథి, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడిగా ఆయన పక్షాన నిలిచింది. రాజకీయ అనుభవంతో పాటు అందర్నీ కలుపుకుపోయే ధోరణిలో పార్థసారథి నియోజకవర్గంలో ఇప్పటికే ఆత్మీయ సమా వేశాలు, పరస్పర బేటీలతో నిమగ్నమై ఆర్భాటంగా నామినేషన్ వేసేందుకు ఇప్పటికే ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఉంగుటూరు నియోజకవర్గం నుంచి ఉమ్మడి కూటమి అభ్యర్థిగా పత్సమట్ల ధర్మరాజు రంగంలో ఉన్నారు. ఆయన కూడా పెద్దఎత్తున నామినేషన్ వేయాలని భావిస్తున్నారు. పోలవరంలో ఉమ్మడి కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు ఇదే దశలో ఉన్నారు. చింతలపూడిలో ఉమ్మడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ మారుమూల పల్లెల్లోను ప్రచారంలో హోరెత్తించారు. తమ ప్రత్యర్థికి దీటుగా వ్యూహ ప్రతివ్యూహాల్లో ముందు ఉన్నారు. నామినేషన్ రోజునే సత్తా చాటాలని భావిస్తున్నారు.

దెందులూరు ఏమవుతుందో? :

దెందులూరు నియోజకవర్గం నుంచి మాస్‌లీడర్ చింతమనేని ప్రభాకర్‌ను ఉమ్మడి కూటమి అభ్యర్థిగా ఇంతకు ముందే ప్రకటించారు. కాని ఈ స్థానంలో బీజేపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి తపనా చౌదరిని రంగంలోకి దింపాలని ఆ పార్టీ భావిస్తోంది. అందుకనే ప్రధాన పక్షాల అధినాయకత్వాలు కూటమి నాయకత్వం దీనిపై సుదీర్ఘ కసరత్తే చేశాయి. బుధవారం పొద్దుపోయిన తర్వాత లేదా గురువారం ఉదయం కీలకపరిణామాలు చోటుచేసుకునే అవకాశాలున్నాయి. తపనా చౌదరి కూడా దెందులూరు నుంచే పోటీ చేయబోతున్నట్లు సంకేతాలు ఇచ్చారు.

ఇక అంతా ఎన్నికల అధికారుల అదుపు ఆజ్ఞలలోనే..

నోటిఫికేషన్ అనంతరం అభ్యర్థుల కదలికలు, ప్రచారం, వ్యయం, కామెంట్లు, ప్రకటనలు ఎన్నికల అధికారుల కనుసన్నల్లో సాగబోతున్నాయి. అభ్యర్థుల ఖర్చు, నామినేషన్ దాఖలు సమయంలో పాటించాల్సిన నియమాలు, ఇవన్నీ క్రమబద్ధీకరణకు వస్తాయి. ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం పరిగణలోకి తీసుకుంటుంది. ఆఖరికి నామినేషన్ దాఖలు సమయంలోనూ రిటర్నింగ్ అధికారి వద్దకు అభ్యర్థితో పాటు మరో నలుగురుని మాత్రమే అనుమతిస్తారు. ప్రదర్శనగా రావడానికి ప్రత్యేకించి అనుమతులు తీసుకోవాలి. కేవలం పది వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వబోతున్నారు. అభ్యర్థుల ఖర్చు, ఎంపీ స్థానానికి అయితే రూ.90 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థులకు అయితే రూ.40 లక్షలు మాత్రమే గరిష్ఠంగా అనుమతి ఇస్తారు. ప్రధాన పక్షాలు, గుర్తింపు పొందిన పక్షాలకు చెందిన అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో నలుగురు ప్రపోజల్స్‌ను చూపించాలి. అదే ఇండిపెండెంట్‌లు అయితే పదిమంది ప్రపోజల్స్‌ను చూపించాల్సిందే.



తూర్పు యడవల్లిలో స్వామివారి కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు.. సీతమ్మ మాంగల్యధారణ ఘట్టాన్ని జరుపుతున్న అర్చకులు

కల్యాణ వైభోగమే..

రమణీయం..రాములోరి కల్యాణం.. జిల్లావ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు

ద్వారకా తిరుమల/చాట్రాయి, ఏప్రిల్ 17 : జిల్లాలో బుధవారం శ్రీరామనవమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రామాలయాలతో పాటు వాడవాడలా ప్రత్యేక వేదికలపై సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. పానకం, ప్రసాదాలు పంపిణీ చేశారు. పలుచోట్ల అన్నసమారాధనలు జరిగాయి. ద్వారకా తిరుమల శ్రీవారి క్షేత్రానికి ఉప దేవాలయమై చినభద్రాద్రిగా పేరొందిన తూర్పు యడవల్లిలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉంచిన సింహాసనంపై సీతారామ సమేత లక్ష్మణ హనుమాన్ విగ్రహాలను ఉంచి అర్చకులు కల్యాణ తంతును ప్రారంభించారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను వంశపారంపర్య సంప్రదాయం ప్రకారం కోటగిరి వంశీయులు తీసుకురాగా ఆలయ అధికారులు పట్టువస్త్రాలను సమర్పించారు. అభిజిత్ లగ్నంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. శ్రీరామనామ స్మరణల నడుమ జరిగిన మాంగల్యధారణను కనులారా వీక్షించిన భక్తజనులు తరించారు.

చనుబండ కోదండరామస్వామి ఆలయంలో..

అపర భద్రాద్రి చనుబండ శ్రీకోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. దేవస్థానం నుంచ రామలక్ష్మణ విగ్రహాలను ఒక పల్లకీలో, సీతమ్మను మరో పల్లకీలో ఉంచి మంగళవాయిద్యాల నడుమ కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. సీతారామ లక్షణుల విగ్రహాలను వేదికపై ఉంచి అర్చక స్వాములు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులు, మరో 25 జంటల దంపతుల చేతుల మీదుగా కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. చుట్టు పక్కల మండలాలు, సరిహద్దున తెలంగాణ గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు బెల్లం పానకం, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు.



చనుబండ కల్యాణోత్సవంలో మంగళసూత్రం చూపిస్తున్న అర్చకస్వామి..తిలకిస్తున్న భక్తులు



భగ భగలు

జిల్లాలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు

ఏలూరు సిటీ, ఏప్రిల్ 17 : భానుడు ఉగ్ర రూపం దాల్చాడు.. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరగడంతో వడగాడ్పుల తీవ్రత బాగా పెరిగింది. జిల్లాలో చాలా ప్రాంతాల్లో బుధవారం పగటి ఉష్ణోగ్రత 44 డిగ్రీల సెంటీగ్రేడ్‌గా నమోదైంది. వృద్ధులు, చిన్నారులు ఉక్కబోతను తట్టుకోలేక పోయారు. ఉదయం 11 గంటలకే రహదారుల పై జనసంచారం కానరాలేదు. వాహన దారులు ఇబ్బందులు పడ్డారు. ఏప్రిల్‌లో గతంతో పోలిస్తే ఈసారి సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని చెబుతున్నారు.

బుధవారం నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	ఉష్ణోగ్రత
ఏలూరు	44/25
నూజివీడు	44/26
చింతలపూడి	44/26
జంగారెడ్డిగూడెం	44/25
భీమడోలు	44/25
ద్వారకాతిరుమల	44/25
కైకలూరు	41/26
కొయ్యలగూడెం	42/22
పోలవరం	44/26
కుక్కునూరు	44/26
వేలేరుపాడు	42/27
దెందులూరు	44/25
పెదవేగి	44/25
పెదపాడు	42/25



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం


జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక


కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


స్వామివారి ఊరేగింపు


ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు


గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



■ నవతరం



అబద్ధాల నేతలకు ఓటు వేయను

రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలి. నేను తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నా. అబద్ధాలు చెప్పే నేతలకు ఓటు వేయను. సమర్థ నాయకుడిని ఎన్నుకుంటేనే సుపరిపాలన, భవిష్యత్‌కు భరోసా. ఓటువేసే ముందు అందరూ ఆలోచించాలి. ఓటు దుర్వినియోగం చేస్తే మనకు, రాష్ట్రానికి తీవ్ర నష్టం.

- చిరుమామిళ్ల జాహ్నవి, దుగ్గిరాల

■ ఏదీ పరిష్కారం

ఐదేళ్లు.. అభివృద్ధి శూన్యం

సీఎం హామీల మోసం

అధికారం ఇవ్వండి.. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తాం.. వారధి, హార్బర్ కట్టి చూపుతాం.. పట్టణంలో కంపోస్టు యార్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం, ఇవి ముఖ్యమంత్రి జగన్, నరసాపురం ఎమ్మెల్యే ప్రసాదరాజు ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలు. ఐదేళ్లు గడిచిపోయాయి.. అభివృద్ధి మాత్రం శూన్యం. పాలకుల హామీలను వివిధ పనుల ప్రారంభోత్సవ శిలాఫలాకాలు వెక్కిరిస్తున్నాయి. 16 నెలల క్రితం ముఖ్యమంత్రి జగన్ రూ.3200 కోట్లతో 13 పనులకు శంకుస్థాపన చేశారు. మూడు నాలుగు పనులు మినహా అన్నీ శిలాఫలకాలకే పరిమితం. కంపోస్టుయార్డు స్థలానికి రూ 1.70 కోట్లు మంజూరు చేయించలేకపోయారు. హామీలు, శంకుస్థాపనలతో ప్రజలను మభ్యపెట్టారని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు. - నరసాపురం


గోదావరి ఏటిగట్టు

• రూ.3200 కోట్ల పనులకు సీఎం శంకుస్థాపన • కలగా మిగిలిన వారధి • ఆచూకీ లేని హార్బర్ • పునాది దాటని ఆక్వా యూనివర్సిటీ

అవినీతి ఊబిలో ఏటిగట్టు

కోతకు గురైన ఏటిగట్టు పనులు అవినీతి ఊబిలో కూరుకుపోయాయి. రూ.27 కోట్లతో పట్టణంలోని అమరేశ్వర స్వామి ఆలయం నుంచి బుడితల రేవు వరకు పనులు చేపట్టాల్సి ఉంది. చేపట్టిన 100మీటర్ల పనులు తరుచూ కోతకు గురవుతున్నాయి. పనుల్లో నాణ్యతలోపం, అవినీతిపై విపక్షాలు ఆందోళనలు కూడా చేపట్టాయి.

జాడలేని రూ.1400 కోట్ల వాటర్ గ్రిడ్

జిల్లాలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించాలన్న ఉద్దేశంతో రూ.1400 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. విజ్జేశ్వరం నుంచి నరసాపురం వరకు పైప్‌లైన్ నిర్మాణ పనులకు ప్రతిపాదించారు. ఈపనులు పునాది కూడా దాటలేదు.

పూడికకు నోచుకోని జగనన్న కాలనీలు

పట్టణం, మండలంలో జగనన్న కాలనీలకు సేకరించిన స్థలాల్లో చాలావరకు పూడికకు నోచుకోలేదు. పట్టణంలోని 4200 మందికి, మండలంలోని మంగళగుంటపాలెంలో స్థలాలు ఇచ్చారు. కొన్ని స్థలాలు పూడిక చేపట్టలేదు. లబ్ధిదారులు ఇల్లు కట్టుకోలేని పరిస్థితి. పూడ్చిన స్థలాల్లో మాత్రం అరకొరగా నిర్మాణాలు జరిగాయి. వైఎస్‌పాలెంలో సేకరించిన స్థలానికి దారి కూడా చూపించలేదు.

కంపోస్టు యార్డు హామీలకే పరిమితం

కంపోస్టుయార్డు సమస్యను ఏడాదిలో పరిష్కరిస్తామని బాధ్యతలు చేపట్టగానే ఎమ్మెల్యే ముదునూరి హామీ ఇచ్చారు. ఇప్పటికే రూ 1.70 కోట్లు 13వ ఆర్థిక సంఘం నిధులు కంపోస్టుయార్డుకు కేటాయించారు. ఇది కాకుండా ప్రభుత్వం నుంచి రూ 1.70కోట్లు కేటాయించాల్సి ఉంది. భూమిని గుర్తించినా ఇంత వరకు నిధులు మంజూరుకాకపోవడంతో ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నెరవేరలేదు.

సబ్ స్టేషన్ కాగితాలకే పరిమితం

నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో విద్యుత్ సమస్య పరిష్కారం కోసం నరసాపురంలో 220 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేసి 16నెలలు గడిచింది. రూ.133 కోట్లతో చేపట్టే ఈప్రాజెక్టుకు రుస్తుంబాద పంచాయితీలో స్థల సేకరణ చేశారు. నేటికి పునాది పడలేదు. కాగితాలకే సబ్‌స్టేషన్ పరిమితమైంది.

అంచనాల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ

నరసాపురం పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు రూ.87 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. నేటికి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలింది. ఇంకా టెండర్లు కూడా పిలవలేదు.

నత్తనడకన వాటర్ ప్రాజెక్టు

పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ 61.80 కోట్లతో చేపట్టిన వాటర్ ప్రాజెక్టు నత్తనడకన సాగుతుంది. ప్రాజెక్టులో భాగంగా మూడు ఓహెచ్ఆర్‌లను నిర్మించాల్సి ఉంది. ఇప్పటివరకు రెండు మాత్రమే నిర్మాణానికి నోచుకున్నాయి. వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, కొత్తపైప్‌లైన్ల పనులు చేపట్టాల్సి ఉంది.

మధ్యస్థంగా రహదారుల నిర్మాణం

రూ.40 కోట్లతో తీర ప్రాంత రహదార్ల అభివృద్ధికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. లక్ష్మణేశ్వరం నుంచి పీఎం.లంక, నరసపురం- నుంచి వైపీ లంక, పసలదీవి పంచాయతీ రహదారి వంటి ప్రధాన రహదార్లు ఉన్నాయి. ఈపనులన్ని నేటికి మధ్యలో ఉన్నాయి. నవరసపురం రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి నాలుగేళ్ల గడిచింది. ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. రహదారుల అభివృద్ధిపై ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నెరవేరలేదు.

మోడి వంతెన హమీకే పరిమితం

మండల కేంద్రమైన మొగల్తూరుతో తీర గ్రామాలను అనుసంధానం చేస్తూ రూ.10 కోట్లతో నిర్మించతలపెట్టిన మోడి వంతెనకు ఎమ్మెల్యే ప్రసాదరాజు ఇచ్చిన హమీ నెరవేరలేదు. ఇప్పటి ఈ పనులకు రెండు సార్లు శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం ముందుకు సాగలేదు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

- గొంతేరు డ్రెయిన్‌పై కొత్తపాలెం-బేతపూడి వంతెన పనులు మధ్యలోనే నిలిచిపోయా యి. సుమారు 12 కోట్లతో ప్రారంభమైన పనులు సాగక ఇరు గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- మండలంలోని పలు ఆర్అండ్‌బి రహదారులు నిర్మాణానికి నోచుకోలేదు. మొగల్తూరు-వెంప, కోమటితిప్ప-కొత్తోట-నీటితిప్ప-జగన్నాథపురం రహదారులకు శంకుస్థాపనలు చేసినా పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.
- మండలంలోని నవరసపురం నుంచి మేడపాడు వరకు 15 కిలోమీటర్ల మేర సీసీ రహదారి నిర్మించాల్సి ఉంది. ఇది శంకుస్థాపన చేశారే తప్ప పనులు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- నరసాపురం మండలం మల్లవరం పెదలంక నుంచి పాలకొల్లు మండలం అగర్తపాలెం మధ్య మురికికాల్వ గట్టు రహదారి శిథిలావస్థకు చేరింది. దీని నిర్మాణం నోచుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- పట్టణంలోని 31వార్డు నుంచి పాలకొల్లు మండలం సగం చెరువు వరకు పంట కాల్వ గట్టున గత ప్రభుత్వం నిర్మించిన రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పాలకొల్లు నుంచి సగం చెరువు వరకు రోడ్డు వేశారే తప్ప నరసాపురం నుంచి సగం చెరువు వరకు రోడ్డు వేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- బియ్యపుతిప్పలో శిథిలావస్థకు చేరిన ఈస్ట్‌కోక్కి అవుట్‌పాల్స్ పనులు నోచుకోలేదు. సముద్రపు పోటు పాటు ప్రభావంతో గోదావరి నీరు పంట కాల్వలకు చేరుతోంది. రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.
- దర్భరేవు అవుట్‌పాల్స్ స్లూయిస్ పనులు కూడా హామీగానే మిగిలింది. శిథిలావస్థకు చేరిన ఈస్లూయిస్‌ను మరమ్మతులతో సరిపెట్టారు. వరదల సమయంలో వందలాది ఏకరాలు ముంపుబారిన పడుతున్నాయి.


నరసాపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్ (ఫైల్)



వారధి టెండర్లు వాయిదాలే..

ఉభయ గోదావరి జిల్లా వాసుల చిరకాల వాంఛ వశిష్టా వారధి. 16 నెలల క్రితం సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. రూ.490 కోట్లతో రాజుల్లంక వద్ద నిర్మించే వారధికి ఎన్‌హెచ్ అధికారులు ఐదు నెలల క్రితం టెండర్లు పిలిచారు. న్యాయపరమైన ఇబ్బందులతో ఇప్పటికీ వాటిని తెరవలేదు. వాయిదాలు వేస్తూ వస్తున్నారు. మరోవైపు పట్టణానికి ఆరు కిలోమీటర్ల దూరంలో వారధి నిర్మాణం వల్ల మాధవాయిపాలెం రేవు సమస్యలు తీరదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ నాయకులు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.



హార్బర్ శిలాఫలకానికే పరిమితం

బియ్యపుతిప్ప వద్ద రూ 430 కోట్లతో కార్గో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన చేసి 16 నెలలు గడిచింది. టెండర్లు పిలిచినా.. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. హార్బర్ నిర్మాణ పనులు తక్షణం చేపట్టాలనే డిమాండ్‌తో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు అధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పనులు ప్రారంభిస్తున్నట్లు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. హార్బర్ నిమిత్తం సేకరించిన స్థలంలో కనీసం పునాది కూడా పడలేదు.



కలగా నల్లి క్రీక్..

గత ప్రభుత్వ హాయంలో రూ.17 కోట్లతో నల్లిక్రీక్ పనులు చేపట్టారు. వైసీపీ అధికారంలోకి రాగానే దీన్ని రద్దు చేసింది. ఇప్పటి వరకు ఈ పనుల ఊసే లేదు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నేటికి నేరవేరలేదు.

నియోజకవర్గంలో డ్రెయినేజీల అధునీకరణ హామీగానే మిగిలింది. పూడిక పనులు చేపట్టి 15ఏళ్లు దాటింది. కొద్దిపాటి వర్షానికే డ్రెయినేజీలు పొంగిపొర్లుతున్నాయి. ముంపుతో రైతులు పంటలను తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన ఎమ్మెల్యే హామీ నేటికి నెరవేరలేదు.



కదలని వియర్ ఛానల్

మొగల్తూరు మండలంలోని శివారు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలని రూ 31 కోట్లతో చేపట్టిన వియర్ ఛానల్ పనుల్లో కదలికలేదు. సీఎం జగన్ వేసిన శిలాఫలకం ఆనవాలుగా మిగిలాయి.

పేరుపాలెం సౌత్‌లో రూ.181 కోట్లతో చేపట్టాల్సిన రెగ్యులేటర్ నిర్మాణంలో పునాదులు కూడా పడలేదు. రెగ్యులేటర్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేసి 16 నెలలు గడిచింది. ఈ పనులు పూర్తయితే సముద్రం ఆటు, పోటుల ప్రభావంతో నష్టపోతున్న రైతులకు ఎంతో ప్రయోజనం కలగనుంది.



పునాదుల్లో ఆక్వా వర్సిటీ

ఆక్వా యూనివర్సిటీ నిర్మాణ పనులు రూ.332 కోట్లతో చేపట్టాల్సి ఉంది. పనులు పునాదులు కూడా దాటలేదు. సరిపల్లిలో 40ఏకరాల విస్తీర్ణంలో పనులు చేపట్టారు. అయితే నిధులు లేకపోవడంతో పునాదుల్లో ఆగపోయాయి. ప్రస్తుతం మొదటి ఏడాది తరగతులు మండలంలోని లక్ష్మణేశ్వరం తుఫాన్ భవనంలోనే కొనసాగుతున్నాయి. చినలంక, వేములదీవి గ్రామాల్లో ప్రాజెక్టుల్లో భాగంగా ల్యాబ్‌లు, పరిశోధన శాలలు నిర్మించాల్సి ఉంది. ఇంత వరకు ఈ పనులకు పునాదులు పడలేదు.



అమ్మో బంగారం..

పోలీసు తనిఖీలతో భయం భయం

భారీగా పెరిగిన ధరలతో అమ్మకాలు లేక డీలా పడిన బులియన్ మార్కెట్‌పై ఎన్నికల కోడ్ మరింత ప్రభావం పడుతోంది. అడుగడుగునా పోలీసులు తనిఖీలు చేస్తుండడంతో కొనుగోలుదారులు పెద్ద మొత్తం సొమ్ముతో మార్కెట్‌కు వచ్చే సాహసం చేయడం లేదు. వస్తువులు కొని తీసుకెళ్లే సమయంలో పోలీసు తనిఖీ జరిగితే సమాధానం చెప్పాల్సి వస్తోంది. దీంతో అమ్మకాలు లేక మార్కెట్ వెలవెలబోయింది. పసిడి ధర పరుగులతో ఆభరణాల కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదు. వివాహాలు, శుభ కార్యక్రమాల నిమిత్తం కొంత మొత్తం వస్తువుల కొనుగోలుకు సైతం తనిఖీల భయం వెంటాడుతోంది. నరసాపురం మార్కెట్ బులియన్‌కు ప్రసిద్ధి. ఉమ్మడి పశ్చిమ గోదావరి, సమీప తూర్పు జిల్లా, కృష్ణా జిల్లాల నుంచి కొనుగోలుదారులు ఇక్కడికి వస్తుంటారు. జిల్లాల సరిహద్దు చెక్ పోస్టులు, మరో నాలుగైదుచోట్ల తనిఖీ తప్పడం లేదు. దీంతో అవసరం ఉన్నా కొనేందుకు ముందుకు రావడం లేదు. క్రెడిట్, డెబిట్ కార్డులతో కొనుగోలుకు 3 శాతం అదనంగా టాక్స్ పడుతోంది. లక్షల్లో కొనుగో లుకు భారీ టాక్స్ చెల్లించాల్సిందే. ప్రస్తుతం ఎన్నికల ప్రభావం బులియన్ మార్కెట్‌పై తీవ్రంగా పడింది. రోజుకు రూ.30 లక్షల విక్రయాలు సాగించే దుకాణంలో రూ.లక్ష వ్యాపారం కూడా జరగడం లేదని వ్యాపారులు వాపోతున్నారు.

- నరసాపురం టౌన్



కులం కాపాడుతుందా?

అధికారుల నియామకంపై ఆశలు

ఎన్నికల వేళ సాధారణంగానే అధికార పార్టీ ఆయా ప్రాంతాలలో తమకు అనుకూల అధికారులను నియమించుకుంటూ ఉంటారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఇంచుమించుగా అనుకూలంగా ఉండే అధికారుల నియామకానికే ప్రాధాన్యం ఇస్తారు. వైసీపీ పాలనలో అభ్యర్థి సామాజిక వర్గం అధికారుల నియామకం చర్చనీయాంశమైంది. పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పోలీస్ సర్కిల్‌లో వైసీపీ అభ్యర్థి సామాజికవర్గానికి చెందిన అధికారులే ఎక్కువగా ఉండడం గమనార్హం. పోలీసుశాఖలోనే కాకుండా ఇంకా పలు శాఖలలో వైసీపీ అభ్యర్థి సామాజిక వర్గానికి చెందినవారిని ముందస్తుగానే నియామకాలు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సమయానికి పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియనప్పటికీ, ఇప్పుడు వివిధ శాఖల అధికారులు పారదర్శకంగానే ముందుకు వెళుతున్నారని పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్నికల కమిషన్ కఠినంగా వ్యవహరిస్తూ ఉండడం, ఎన్నికల నియమావళిని కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తుండడంతో వివిధ శాఖలలోని అధికారులు, ఉద్యోగులు నిబద్ధతతోనే పనిచేస్తున్నట్లుగతెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ శాంతిభద్రతల పర్యవేక్షణలో నియోజకవర్గంలో తమదే పట్టు అని ఒక సామాజిక వర్గానికి చెందిన పలువురు వ్యాఖ్యానించడం గమనార్హం.

- పాలకొల్లు

ఎన్నికల వేళ ఆత్మీయత..

పోటాపోటీగా అభ్యర్థులు ఆకట్టుకునే ప్రయత్నాలు




ఎన్నికల వేళ ఆత్మీయత వెల్లువిరుస్తోంది. పోటీలో ఉన్న అభ్యర్థులు ఇంటింటి ప్రచారం కన్నా ముందు ఆత్మీయత కురిపిస్తున్నారు. అభ్యర్థులు పోటాపోటీగా ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ మొదలుకుని గ్రామాల్లో ఆత్మీయ సమావేశాల జోరు కొనసాగుతోంది. వృత్తులు, సంఘాలు, కులాలా వారీగా కూడా ఆత్మీయ సమ్మేళనాలు సాగుతున్నాయి. సమస్యలపై పరిష్కార హామీలు ప్రధాన ఆకర్షణ. ఏ గ్రామంలో ఎవరికి బలం ఎంతున్నది కొంత వరకు అభ్యర్థులు అంచనాలకు దారి చూపిస్తున్నారని అనుకోవాలి. ఆత్మీయ సమావేశాలు ప్రస్తుతం ఎన్నికలలో ప్రచార ఆయుధాలుగా మారాయి. - భీమవరం రూరల్

అక్కడ మూడు నియోజకవర్గాల చర్చ



ఎన్నికల నేపథ్యంలో ప్రతి నియోజకవర్గంలోనూ ప్రధాన పార్టీల గెలుపు, ఓటములపైనే చర్చ సాగుతోంది. అభ్యర్థుల బలాబలాలు, ప్రధాన పార్టీల ఎత్తులు, పైఎత్తులపైనే చర్చించుకుంటారు. నరసాపురంలో మాత్రం మూడు జిల్లాల రాజకీయంపై చర్చ సాగుతోంది. ఈ నియోజకవర్గం రెండు జిల్లాల సరిహద్దులో ఉంది. ఒకవైపు కోనసీమ, మరోవైపు కృష్ణా జిల్లాలు ఉన్నాయి. కోనసీమ జిల్లాకు గోదావరే సరిహద్దు. ఆ జిల్లా ప్రజలు తెల్లారితే నరసాపురంలోనే ఉంటారు. నరసాపురం నియోజకవర్గంలోని మొగల్తూరు సరిహద్దు మండలం కృష్ణా జిల్లా కృత్తివెన్ను. ఈ ప్రాంతం వారు కూడా తెల్లారితే మొగల్తూరులో ఎక్కువ ఉంటారు. ఎన్నికలు వస్తే నరసాపురం నియోజకవర్గ ప్రజలకు పక్కనున్న రెండు నియోజకవర్గాల రాజకీయ పరిస్థితులపై చర్చించుకోవడం పరిపాటి. అక్కడా ఇక్కడా అందరికి పార్టీల విజయాలపై ఆసక్తి నెలకొంది. విజయావకాశాలపై చర్చలు జోరందుకున్నాయి. - నరసాపురం



నామినేషన్ ఇలా..

సార్వత్రిక ఎన్నికల్లో మరో అంకం ప్రారంభం కానుంది. ఎన్నికల సంఘం గురువారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనుండడంతో నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అభ్యర్థులు ఇప్ప టికే నామినేషన్ దాఖలుకు ముహూర్తాలు ఖరారుచేసుకున్నారు. మంచి రోజు, తిథి, ఘడియాలు చూసుకున్నారు. కార్యకర్తలు, అభిమానుల, నాయకులు భారీ తరలివచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అధికారులు కూడా నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. నామినేషన్ ప్రక్రియపై అధికారులు అవగాహన కల్పించారు.

నామినేషన్ ప్రక్రియ కీలకం

ఎన్నికల ప్రక్రియలో కీలకం నామినేషన్. నిబంధనల మేరకు దాఖలైన నామినేషన్ మేరకు అభ్యర్థి పోటీలో ఉంటారు. నామినేషన్ ప్రక్రియలో సరైన అవగాహన లేక గతంలో పలువురు అభ్యర్థుల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. అభ్యర్థులు నామినేషన్ ప్రక్రియ సజావుగా జరగడం కోసం రిటైర్డు ఉద్యోగులను, సీనియర్ అడ్వకేట్ సలహాలు తీసుకుంటారు.

నామినేషన్‌లో కీలక అంశాలు

- నామినేషన్ దాఖలులో అభ్యర్థి పేరు ఓటరు జాబితా, ధ్రువీకరణ పత్రాలలో ఒకేలా ఉండాలి, లేనిపక్షంలో తగిన విధంగా డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.
- ఎన్నికల నోటిఫికేషన్ పేర్కొన్న విధంగా ప్రభుత్వ పని దినాలలో ప్రకటిత తేదీలలో నామినేషన్ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్‌కు సమర్పించాలి.
- నామినేషన్ స్వీకరణ సమయం పని దినాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే ఆర్‌వో స్వీకరిస్తారు. స్వీకరణ సమయం 3 గంటలలోపు ఆర్‌వో రూములో ఉండాలి.
- నామినేషన్ దరఖాస్తులు 1961 ప్రజా ప్రతినిధ్యచట్టం ప్రకారం ఫారం -1 సెక్షన్ 31 లో పేర్కొన్న నమూనా దరఖాస్తుల ప్రకారమే స్వయంగా దాఖలు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థి సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నామినేషన్లు సమర్పించవచ్చు.
- ఒక అభ్యర్థి 2 కంటే ఎక్కువ నియోజకవర్గాల నుంచి పోటీకి నామినేషన్లను దాఖలు చేయకూడదు.
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య అభ్యర్థి లేదా అతని ప్రపోజర్ లేదా అతని ఏజెంట్ క్యూర్ కోడ్‌తో కూడిన ప్రింట్‌అవుట్ సంతకం చేయబడిన సిరాతో నామినేషన్ సమర్పించవచ్చు.
- నామినేషన్ల స్వీకరణకు ఒక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నారు.
- నామినేషన్ దాఖలుకు అభ్యర్థి తన కాన్వాయ్‌ను కార్యాలయానికి 100 మీటర్లు దూరంలో ఆపి గరిష్ఠంగా 3 వాహనాలతో మాత్రమే కార్యాలయ ప్రాంగణంలోకి ప్రవేశించాలి. గరిష్ఠంగా 5 గురు వ్యక్తులకు (ఒక అభ్యర్థి, నలుగురు ప్రతిపాదకులు) మాత్రమే ఆర్‌వో వద్దకు ప్రవేశం ఉంది.
- అభ్యర్థి 1951 ప్రాతినిధ్య చట్టం ప్రకారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తరుపు వ్యక్తి 2ఎ సమర్పించాలి.
- స్వతంత్ర అభ్యర్థి 10 మంది ఓటర్లతో ప్రతిపాదకులు సమర్పించాలి. ప్రతిపాదకులు ఆ పార్లమెంటరీ నియోజకవర్గంలో ఓటరు అయి ఉండాలి.
- అభ్యర్థి వయసు, పౌరసత్వంపై డిక్లరేషన్ సమర్పించాలి.
- ఒక అభ్యర్థి గరిష్ఠంగా 4 సెట్లు నామినేషన్ పత్రాలు సమర్పించవచ్చు.
- చివరి రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఒక్క సెకండ్ దాటినా నామినేషన్ తీసుకోవడానికి అవకాశం ఉండదు.

నామినేషన్ డిపాజిట్ ఎవరికి ఎంత..

- ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి 1951 ప్రజా పాతినిధ్య చట్టం ప్రకారం డిపాజిట్ సమర్పించాలి. 8443 సివిల్ డిపాజిట్ 121 పేరున ట్రెజరీ చలానా చెల్లించాలి.
- పార్లమెంటు స్థానంలో అభ్యర్థి రూ 25 వేలు డిపాజిట్ సమర్పించాలి. ఎస్సీ ఎస్టీ రిజర్వు నియోజకవర్గమైతే రూ.12,500 డిపాజిట్ సమర్పించాలి.
- అసెంబ్లీ నియోజవర్గ అభ్యర్థి రూ. 10 వేలు, ఎస్సీ, ఎస్టీ నియోజవర్గమైతే రూ.5 వేలు డిపాజిట్ సమర్పించాలి.
- ఒక డిపాజిట్ రసీదుతో 4 సెట్లు నామినేషన్ పత్రాలు సమర్పించవచ్చు.

- భీమవరం టౌన్/నిడమర్రు

ఆ బూత్‌లలో పోలింగ్ తక్కువ



ఎన్నికలు వస్తుంటే ప్రభుత్వాన్ని మార్చాలని ఎదురుచూసి ఓటు వేసేవారు కొందరు.. ఓటుకు సొమ్ము ఆశించే వారు కొందరు. మరికొందరు ఓటు వేయడానికే ఆసక్తి చూపించరు. గత ఎన్నికల్లో ఆ పోలింగ్ బూత్‌లలో పోలింగ్ శాతం మరీ తక్కువగా నమోదైంది. 2019 సాధారణ ఎన్నికల్లో పలు పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ చాలా తక్కువ నమోదైంది. కొన్ని నియోజకవర్గాలు అతి తక్కువ 43 శాతం నమోదు కావడం గమనార్హం. పశ్చిమగోదావరి జిల్లాలో తణుకు నియోజకవర్గం 97 నెంబర్ బూత్‌లో 43.16 శాతం ఓటింగ్ మాత్రమే నమోదైంది. 76 నెంబరు బూత్‌లో 50.60 శాతం నమోదైంది. తరువాత తాడేపల్లిగూడెంలో తక్కువ ఓటింగ్ నమోదైన రికార్డులు ఉన్నాయి. ఇక్కడ 132 బూత్‌లో 52.90 శాతం, 95 స్టేషన్లో 56.07 శాతం ఓటింగ్ నమోదైంది. తర్వాతి స్థానంలో భీమవరం అసెంబ్లీ ఉంది. ఈ నియోజకవర్గంలో 63 బూత్‌లో 55.23 శాతం నమోదు కాగా, 63 ఏ బూత్‌లో 56.12శాతం నమోదైంది. ఎక్కువ బూత్‌లలో 59లోపు శాతం పోలింగ్ నమోదైంది. పాలకొల్లు నియోజకవర్గం 75వ బూత్‌లో 65.30 శాతం, 121 బూత్‌లో 65.79శాతం నమోదైంది. నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 32 పోలింగ్ బూత్ 67.06 శాతం, 25 బూత్‌లో 68.53 నమోదైంది. ఆచంట నియోజకవర్గం 43 బూత్‌లో 70 శాతం, 44 బూత్‌లో 72.56 శాతం తక్కువ ఓటింగ్. తర్వాతి స్థానంలో ఉండి నియోజకవర్గం ఉంది. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఓటింగ్ శాతం 82 వరకు నమోదైంది ఉండి నియోజకవర్గంలో మాత్రమే.

పోలింగ్ శాతం పెంచేందుకు కృషి

ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడానికి అధికారులు చర్యలు చేపట్టారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొత్తగా ఓటు పొందిన యువత నూరు శాతం ఓటు వేసేలా చర్యలు చేపట్టారు. కళాశాలల్లో ఎలక్ట్రోల్ లిటరసీ క్లబ్‌లను ఏర్పాటుచేసి ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు. రానున్న 2029లో ఎన్నికల్లో పూర్తి అవగాహనతో ఓటు వేసేవిధంగా ప్రస్తుతం 9,10వ తరగతి చదువుతున్న యువతరాన్ని ఓటు విలువ గురించి పాఠశాలలో చెప్పిస్తున్నారు. తల్లితండ్రులను కూడా చైతన్యపరిచేవిధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తదుపరి ఎన్నికలపై కూడా అధికారులు దృష్టి సారించారు. - భీమవరం

వీరాభిమాని

తెలుగుదేశం పార్టీకి తాతపూడి మారుతీరావు వీరాభిమాని. 1982లో ఎన్టీ రామారావు పార్టీ స్థాపించినప్పటి నుంచి ఆయన పార్టీలో కొనసాగుతున్నారు. తణుకు ప్రాంతానికి చెందిన బ్రాహ్మణ కుటుంబానికి చెందిన మారుతీరావు ఆంధ్రాషుగర్స్‌లో చిరు ఉద్యోగిగా ఉంటూనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఎంతోమంది నాయకులు వచ్చి వెళ్లిపోయినా మారుతీరావు పార్టీ జెండా మోస్తూనే ఉన్నారు. మారుతీరావు కుటుంబ సభ్యులంతా పౌరోహిత్యం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. **- తణుకు**



తెలుగుదేశానిదే హవా !



ఈలి నాని చూపు ఎటు ?



తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో బలమైన నేతల్లో ఒకరైన ఈలి నాని అడుగులు ఎటు పడతాయన్నది సర్వత్రా నెలకొన్న ప్రశ్న. ఇటీవల ఆయన వైసీపీ తరపున టికెట్ ఆశించి జగన్ సమక్షంలో వైసీపీ గూటికి చేరారు. ఆ సమయంలో గూడెం వైసీపీ టికెట్ ఈలి నానికి ఇస్తారని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే సీటు సిట్టింగ్ మంత్రి కొట్టు సత్యనారాయణకే ఇస్తున్నట్టు వైసీపీ జాబితా ప్రకటించారు. దీంతో సీటు నానికి కేటాయిస్తారన్న చర్చకు కొంత తెరపడినా కొన్ని రోజులుగా సీటు మార్పు ఉంటుందనే వాదన ఊపందుకుంది. దీంతో ఈలి నాని వర్గంలో ఎంతో కొంత ఆశలు సజీవంగా ఉన్నాయి. తాజాగా భీమవరం సభలో కొట్టును గెలిపించాలని జగన్ ప్రకటించడంతో ఈలి నాని వర్గం ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. దీంతో ఈలి నాని ఏం చేస్తారనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఆయన వెంట నడిచే నాయకులు ఆయనకు టికెట్టు దక్కలేదనే నిరాశతో కూటమి వైపు చూస్తున్నారు.. కొందరైతే కండువా కూడా కప్పుకున్నారు. ఈలి నాని బలమైన నాయకుడు. ఆయనకు సొంత క్యాడర్‌తో పాటు సౌమ్యుడు, బలమైన కుటుంబ నేపథ్యం ఉన్న వ్యక్తి. నిజాయితీగా రాజకీయాలు చేస్తాడనే ముద్ర ఉంది. గతంలో ఈలి కుటుంబం నుంచి నాని తండ్రి ఈలి ఆంజనేయులు రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఒకసారి మంత్రిగా బాధ్య తలు చేపట్టారు. ఆయన తల్లి ఈలి వరలక్ష్మి కూడా రెండు సార్లు తాడేపల్లిగూడెం నుంచి ఎమ్మెల్యేగా గెలు పొందారు. దీంతో పాటు ఈలి నాని ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావ సమయంలో జిల్లా నుంచి గెలిచిన ఒకే ఒక్క ఎమ్మెల్యేగా చరిత్ర ఉంది.

పెదతాడేపల్లి.. టీడీపీకి కంచుకోట

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో టీడీపీకి కంచుకోటగా నిలిచిన గ్రామం పెదతాడేపల్లి. ఈ గ్రామంలో అభ్యర్థి ఎవరైనా టీడీపీ అభ్యర్థి బరిలో ఉంటే ఆ పార్టీ అభ్యర్థికి మెజారిటీ కట్టబెడతారు. టీడీపీ పొత్తులో ఉండే అభ్యర్థి అయినా ఆ అభ్యర్థికే పెదతాడేపల్లి ఓటర్లు అండగా నిలుస్తారు. గతంలో పొత్తులో భాగంగా బీజేపీ అభ్యర్థి పైడికొండల మాణిక్యాల రావుకు ఈ గ్రామంలో 1550 ఓట్లు వచ్చాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ ఎదురు గాలిలో కూడా టీడీపీ అభ్యర్థికి 1250 ఓట్లు రావడం విశేషం.

- తాడేపల్లిగూడెం రూరల్

ఫ్లాష్ బ్యాక్



దెందులూరు నియోజకవర్గం కొత్తగా ఏర్పడిన ఏలూరు జిల్లా పరిధిలోకి వస్తుంది. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో ఉంది. 2024 ఓటర్ల జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం 2,22,777 ఓటర్లు ఉండగా పురుషులు 1,08,465 మంది, మహిళలు 1,14,305 మంది ఉండగా ఇతరులు ఏడుగురు ఉన్నారు. మొత్తంమీద ఈ నియోజకవర్గంలో మహిళలదే పైచేయిగా ఉంది. - పెదవేగి

పదింట ఆరుసార్లు టీడీపీదే గెలుపు

కాంగ్రెస్ మూడుసార్లు విజయం
ఒక్కసారి గెలిచిన వైసీపీ

దెందులూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉంది. టీడీపీ ఆవిర్భావం నుంచి మెజారిటీ విజయాలతో ముందంజలో ఉంది. 1983లో తెలుగుదేశం ఆవిర్భవించిన తొలిసారే గారపాటి సాంబశివరావు 23,637 ఓట్లు ఆధిక్యంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం చార్లెస్‌పై ఘన విజయం సాధించారు. ఆ తరువాత రెండేళ్లకే జరిగిన ఉప ఎన్నికలో సైతం సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి ఎం.పద్మావతిపై 18,171 ఓట్ల ఆధిక్యంతో గెలిచి తన స్థానాన్ని పదిలపర్చుకున్నారు. అయితే తరువాత జరిగిన 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాగంటి రవీంద్రనాధ్ చౌదరిపై టీడీపీ అభ్యర్థి గారపాటి సాంబశివరావు ఓటమి పాలయ్యారు. రెండేళ్ల తరువాత 1991లో మాగంటి రవీంద్రనాధ్ చౌదరి ఆకస్మిక మరణంతో జరిగిన ఉప పోరులో మాగంటి సతీమణి వరలక్ష్మీదేవిపై గారపాటి మరోసారి ఓటమి చెందారు. తరువాత 1994, 1999 సాధారణ ఎన్నికల్లో గారపాటి సాంబశివరావు వరుసగా గెలుపొందారు. 2004లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాగంటి బాబుపై గారపాటి సాంబశివరావు ఓటమి చెందారు. దీంతో ఆయన రాజకీయ జీవితం అక్కడితో ఆగిపోయింది. 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లోనూ చింతమనేని ప్రభాకర్ వరుసగా రెండోసారి గెలుపొందారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి గెలుపొందారు. కాగా ఇప్పటివరకు పోటీలో నిలబడి వరుసగా గెలుపొందిన అభ్యర్థులు లేరు. కాకపోతే 1962లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన మొటపర్తి రామ్మోహనరావు, 1967లో రెండోసారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి గెలుపొందారు. మూడోసారి 1972లో జరిగిన ఎన్నికల్లో మొటపర్తి రామ్మోహనరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ ఒక్కటీ తప్ప పోటీలో నిలబడి మూడోసారి గెలుపొందిన అభ్యర్థులు దెందులూరు నియోజకవర్గంలో ఇంతవరకు లేరు.

2019లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ అభ్యర్థి కొఠారు అబ్బయ్య చౌదరి 95 వేల ఓట్లతో (51.42 శాతం) విజయం సాధించారు. టీడీపీ నుంచి పోటీలో ఉన్న చింతమనేని ప్రభాకర్‌కు 78,683 (42.08 శాతం) ఓట్లు లభించాయి.ఆ ఎన్నికల్లో మొత్తం 2,20,274 మంది ఓటర్లు ఉండగా 1,86,989 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

టీడీపీ ఆవిర్భావం నుంచి జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన, గెలిచిన అభ్యర్థుల వివరాలు

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజారిటీ
1983	గారపాటి సాంబశివరావు	టీడీపీ	నీలం చార్లెస్	కాంగ్రెస్	23,637
1985	గారపాటి సాంబశివరావు	టీడీపీ	ఎం.పద్మావతి	కాంగ్రెస్	18,171
1989	మాగంటి రవీంద్రనాధ్‌చౌదరి	కాంగ్రెస్	గారపాటి సాంబశివరావు	టీడీపీ	18,494
1991	మాగంటి వరలక్ష్మీదేవి	కాంగ్రెస్	గారపాటి సాంబశివరావు	టీడీపీ	5,194
1994	గారపాటి సాంబశివరావు	టీడీపీ	పాతూరి జాన్‌పాల్	కాంగ్రెస్	28,861
1999	గారపాటి సాంబశివరావు	టీడీపీ	కొమ్మారెడ్డి మాధవరావు	కాంగ్రెస్	8,737
2004	మాగంటి బాబు	కాంగ్రెస్	గారపాటి సాంబశివరావు	టీడీపీ	13,311
2009	చింతమనేని ప్రభాకర్	టీడీపీ	కొఠారు రామచంద్రరావు	కాంగ్రెస్	14,235
2014	చింతమనేని ప్రభాకర్	టీడీపీ	కారుమూరి నాగేశ్వరరావు	వైసీపీ	17,746
2019	కొఠారు అబ్బయ్యచౌదరి	వైసీపీ	చింతమనేని ప్రభాకర్	వైసీపీ	17,459



మూడుసార్లు మంత్రి పదవులు

దెందులూరు నియోజకవర్గానికి రెండుసార్లు మంత్రి పదవి వచ్చింది. 1989లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన మాగంటి రవీంద్రనాధ్ చౌదరి దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రిగా పనిచేశారు. మంత్రిమండలి పునర్ వ్యవస్థీకరణ సమయంలో పంచాయతీరాజ్ శాఖామంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొద్దిసేపటికే మృతి చెందారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో మాగంటి రవీంద్రనాధ్ చౌదరి సతీమణి వరలక్ష్మీదేవి టీడీపీ అభ్యర్థి గారపాటి సాంబశివరావుపై గెలుపొంది రాష్ట్రమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2004లో ఎన్నికల్లో విజయం సాధించిన మాగంటి బాబు రాష్ట్రమంత్రిగా పనిచేశారు. మూడు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గానికి మంత్రి పదవులు వచ్చాయి. అయితే 1988లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ ఎన్టీ రామారావు హయాంలో బడ్జెట్ ముందే లీకు కావడంతో జరిగిన మంత్రి మండలి రద్దు నిర్ణయంతో అనంతరం ఏర్పడిన మంత్రివర్గంలో గారపాటి సాంబశివరావును మంత్రి పదవి వరించింది.

సెంటిమెంట్

నామినేషన్‌కు ముందు ఈ స్వామిని దర్శించుకోవాల్సిందే



ఎన్నికలలో పోటీ చేసేవారందరికి ఇక్కడి కొలువైన స్వామిని దర్శించుకోవడం ఒక సెంటిమెంట్. తాడేపల్లి గూడెం నుంచి ఎవరు నామినేషన్ వేసినా ముందుగా ఈ ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించి పూజలు చేసుకోవల్సిందే. పెంటపాడు మండలం కే.పెంటపాడు గ్రామంలోని బైరాగిమఠం గోపాలస్వామి, ఆంజనేయస్వామి ఆలయం గడిచిన 20 సంవత్సరాలుగా రాజకీయ నాయకులకు సెంటిమెంట్‌గా మారింది గెలిచిన తరువాత కూడా ఈ స్వామిని దర్శించుకున్న తర్వాతే తమ పనులు మొదలు పెడతారు. ప్రస్తుత డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని ఇలా అందరికి ఈ స్వామి అంటే చాలా సెంటిమెంట్. ప్రస్తుత డిప్యూటీ సీఎం కొట్టుసత్యనారాయణ వైసీపీ నుంచి గెలకముందుకు ఈ స్వామిని దర్శించుకుని నామినేషన్ వేసి విజయం సాధించారు. రెండు సంవత్సరాలకు ముందుకు బైరాగిమఠంలో సీతారాముల కల్యాణం వీక్షిస్తున్న సమయంలో ఆయనకు పార్టీ అధిష్టానం నుంచి ఫోన్ వచ్చింది. దేవదాయ శాఖ మంత్రిగా పదవి ఇస్తున్నట్టు చెప్పడంతో సెంటిమెంట్ ఇంకా బలపడిపోయింది. మాజీ మంత్రి మాణిక్యాలరావు కూడా ఎమ్మెల్యేగా నామినేషన్ వేసే ముందుకు ఈ స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా నెగ్గి ఆపై మంత్రి అయిన వెంటనే మరలా వచ్చి స్వామిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఈలి నానికి కూడా ఈ స్వామి అంటే బాగా సెంటిమెంట్. ప్రతీ సంవత్సరం బైరాగిమఠంలో జరిగే సీతారాముల కల్యాణానికి తప్పని సరిగా హాజరవుతారు. ప్రస్తుత జనసేన, తెలుగుదేశం, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ ఈ నెల 19 వ తేదీన నామినేషన్ వేసేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. నామినేషన్ వేసే ముందు బైరాగిమఠంలో స్వామివారిని దర్శించుకుని అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేసేందుకు సన్నాహం చేసుకున్నారు. ప్రస్తుత డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ కూడా నామినేషన్ వేసేముందు స్వామివారిని దర్శించుకునే వెళ్తానంటూ బైరాగిమఠంలో జరిగిన సీతారామకల్యాణ వేడుకలలో తెలిపారు. అయితే ఈయన నామినేషన్ ముహూర్తం ఇంకా ఖరారు కాలేదు. **- పెంటపాడు**

ముదునూరి..శాండ్ మాఫియా డాన్

ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బండారు

నరసాపురం, ఏప్రిల్ 17: ఉభయ గోదావరి జిల్లాలో ముదునూరి ఇసుక మాఫీయాకు డాన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ మోసగాడు మరోసారి గెలిస్తే నరసాపురం సర్వనాశనం అవుతుంది.. అంటూ నరసాపురం వైసీపీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజుపై మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు తీవ్రమైన ఆరోపణలు చేశారు. బుధవారం రాత్రి తెలగా కల్యాణ మండపంలో జరిగిన కూటమి ఆత్మీయ సమావేశంలో బండారు మాట్లాడారు. "ఎన్నికల నేపథ్యంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు బీసీ, ఓసీలంటూ విభజిస్తున్నాడు..జాగ్రత్తగా ఉండాలి..మన మధ్య చిచ్చుపెట్టి గెలుపు కోసం ఎత్తులు వేస్తున్నాడు..ఈ దుర్మార్గుడు మరోసారి ఎమ్మెల్యే అయితే మన ఆస్తులకు రక్షణ ఉండదు.." అంటూ తీవ్రస్థాయిలో విమర్శించారు. గత ఎన్నికల్లో గెలిచి ఎస్సై మల్లిఖార్జునరెడ్డిని అడ్డం పెట్టుకుని ఎంత దోచుకున్నాడో నరసాపురం ప్రజ లందరికీ తెలుసు. గోదావరి ఒడ్డున ఉన్న విశాలవంతమైన ముదునూరి భవనం ఎస్‌ఐ ద్వారా వసూలు చేసిన సొమ్ము తోనే బాగు చేయించుకున్నాడు. తీర ప్రాంతంలో వందల ఎకరాలు కొని వాటి విలువ పెంచుకునేందుకు వశిష్టా వారధిని రాజుల్లంక తీసుకెళ్లాడు.. మనకు రావాల్సిన జిల్లా కేంద్రం, మెడికల్ కాలేజీ తరలిపోవడానికి ముదునూరే కారణం అని ఫైర్ అయ్యారు.

కూటమి గెలుపే మన అందరి ఎజెండా : పితాని

నరసాపురం ఎంపీ అభ్యర్థిని మారుస్తున్నారంటూ కొందరు డ్రామాలు ఆడిస్తున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థిగా శ్రీనివాసవర్మే కొన సాగుతారని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ స్పష్టం చేశారు. మన పార్టీలు వేరైనా నినాదం మాత్రం ఒక్కటే అని పార్టీ అధిష్ఠానం నిర్ణయం కూడా నరసాపురంలో నాయకర్ గెలవాలని, పార్లమెంట్‌లో శ్రీనివాసవర్మ కాలు పెట్టాలని ఇందుకు నాయకులు, కార్యకర్తలు అందరు సమిష్టిగా పని చేయాలంటూ దిశానిర్దేశం చేశారు.బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే కేంద్రాన్ని ఒప్పించి నరసాపురం- కోటిపల్లి రైల్వే లైన్ పనుల్ని పూర్తి చేయిస్తామన్నారు. జిల్లాకు ముఖద్వారంగా నరసాపురాన్ని తీర్చిదిద్దుతామన్నారు.జనసేన అభ్యర్థి నాయకర్ మాట్లాడుతూ ముదునూరిని ఇంట్లో కూర్చోబెట్టడమే ఏకైకా ఎజెండా అన్నారు.అనంతరం పితాని ఘనంగా సత్క రించారు. కుక్కల మీరయ్య, చినమిల్లి సత్యనారాయణ, నార్ని తాతాజీ, మేకల సతీష్, డాక్టర్ ప్రకాష్, చిటికెల రామ్మోహన్, రేవు ప్రభుదాసు, కడలి మోహన్, అంద్రాజు రామన్న, కొట్టు పండు తదితరులు పాల్గొన్నారు.



పితాని సత్యనారాయణను సన్మానిస్తున్న బండారు మాధవనాయుడు, నాయకర్ తదితరులు

బీ-ఫాంలు అందాయి



బుధవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నుంచి ఆ పార్టీ అభ్యర్థులు బి.ఫాంలు అందుకున్నారు. అభ్యర్థులు వరుసగా బొలిశెట్టి శ్రీనివాస్ (తాడేపల్లిగూడెం), బొమ్మిడి నాయకర్ (నరసాపురం), పత్సమట్ల ధర్మరాజు (ఉంగుటూరు), పులపర్తి రామాంజనేయులు (భీమవరం), చిర్రి బాలరాజు (పోలవరం) కందుల దుర్గేష్ (నిడదవోలు).

16-04-2024 పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	246	225	237.14
జంగారెడ్డిగూడెం-1	249	235	243.13
జంగారెడ్డిగూడెం-2	249	235	242.66
కొయ్యలగూడెం	249	235	242.91
గోపాలపురం	249	235	242.27



ద్వారకాతిరుమలలో రాజీనామా పత్రాలందిస్తున్న వలంటీర్లు

బలవంతపు రాజీనామాలు !

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 17: కొందరు వైసీపీ నాయకులతో కలసి అధికారులు వలంటీర్లతో చేయిస్తున్న బలవంతపు రాజీనామాలు కలకలాన్ని రేపుతున్నాయి. మండలానికి చెందిన ఓ అధికారి వలంటీర్లను వైసీపీ నాయకులను కలవాలని వాట్సప్ మెసేజ్‌లు పెడుతున్నట్లు సమాచారం. అదేవిధంగా వలంటీర్లందరూ రాజీనామా చేయాలని అలా చేసిన వారినే ఎన్నికల తర్వాత కంటిన్యూ చేస్తామని బెదిరిస్తూ బలవంతంగా వారిచే రాజీనామాలు చేయిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో చేసేది లేక మండలంలో 27 మంది వలంటీర్లు రాజీనామా చేశారని తెలుస్తోంది. ఈ అధికారి జిల్లా అధికారి ఆధ్వర్యంలో పనిచేస్తారని ఇక్కడి అధికారులు చెబుతున్నారు. వైసీపీకి తొత్తులుగా పనిచేస్తున్న అధికారులపై ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నలుగురిపై పీడీ యాక్ట్ నమోదు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 17 : జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో పదే పదే నేరాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను గుర్తించి పీడీ యాక్ట్ నమోదు చేసినట్టు జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర తెలిపారు. జంగారెడ్డిగూడెం పోలీసు స్టేషన్‌లో విలేకరులకు బుధవారం వివ రాలను వివరించారు. అరెస్ట్ అయిన వారిలో జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కోడూరి రవితేజ, కోన శ్రీనివాస్ అలియాస్ పెప్సీ నాని, మద్దిపాటి కళ్యాణ్, షేక్ నాగూర్ మీరా వల్లీ అలియాస్ బబ్లూ ఉన్నారు. కోడూరి రవితేజపై ఏలూరు, తడికలపూడి, నల్లజర్ల, కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లలో పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. కోన శ్రీనివాస్‌పై జంగారెడ్డిగూడెం, ద్వారకా తిరుమల, ఏలూరు, తడికలపూడి, నల్లజర్ల, కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లలో, మద్దిపాటి కల్యాణ్‌పై జంగారెడ్డిగూడెం, తడికలపూడి, నల్లజర్ల, కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లలో, షేక్ నాగూర్ మీరా వల్లీపై జంగారెడ్డిగూడెం, లక్కవరం, నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌లలో పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ నలుగురితో పాటు మరికొంత మంది వ్యక్తులు కలిసి ఈ ఏడాది ఫిబ్రవరి 21న నల్లజర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 3.500 కేజీల బంగారు ఆభరణాలు, కొంత నగదును ఒక బంగారు వ్యాపారిని అడ్డగించి దోచుకున్నారని తెలిపారు. ఈ కేసులో ప్రస్తుతం వీరు ఏలూరు జైలులో రిమాండ్‌లో ఉన్నట్లు తెలిపారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ రాజేష్, ఎస్ఐ జ్యోతిబసులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిచంద్ర

నిట్ పూర్వ విద్యార్థి నవ్యశ్రీకి సివిల్స్‌లో 995 వ ర్యాంకు



తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 17 : ఏపీ నిట్‌లో చదివిన గోవాడ నవ్యశ్రీ సివిల్స్ ఫలితాలలో జాతీయ స్థాయిలో 995వ ర్యాంకు సాధించినట్టు రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్‌రెడ్డి తెలిపారు. తమ విద్యార్థిని సివిల్స్‌లో విజయం సాధించడం అభినందనీయమన్నారు. గతంలో మూడుసార్లు సివిల్స్ రాసిన విజయం పొందలేదని అయినా నిరుత్సాహపడకుండా నాల్గో ప్రయత్నంలో విజయం సాధించిందన్నారు. ఐఆర్‌ఎస్‌లో ఉద్యోగం పొందే అవకాశం ఉందన్నారు. బీటెక్ పూర్తి కాగానే ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనపర్చి ఆరోగ్య శాఖలో గ్రూప్ క్యాడర్ అధికారిణిగా ఉద్యోగం సాధించిందన్నారు. ఉద్యోగం చేస్తూనే సివిల్స్ రాసి విజయం సాధించిందన్నారు. నిట్ ఇంచార్జి డైరక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి, రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వీ.సందీప్, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ టీ.రమేష్, తదితరులు నవ్యశ్రీకి అభినందనలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి ఎంపీ అభ్యర్థి మహేష్‌యాదవ్

జగన్ అరాచక పాలనకు స్వస్తి పలకాలి

ఏలూరు కూటమి ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులు మహేష్‌యాదవ్, చంటి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 17: ఓటు అనే రామబాణం సంధించి జగన్ అరాచక పాలనకు స్వస్తి పలకాలని ఏలూరు పార్లమెంట్, అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు పుట్టా మహేష్‌యాదవ్, బడేటి చంటి పిలుపునిచ్చారు. బుధవారం పవర్‌పేటలో నిర్వహించిన ప్రజాగళంలో వారు మాట్లాడారు. ఒక్కఛాన్స్ అంటూ ప్రజలనెత్తిన జగన్ భస్మాసుర అస్త్రం పెట్టారని విమర్శించారు. జగన్ తన ఐదేళ్ళ పాలనలో ప్రజలకు చేసిన మేలు ఏమిటో చెప్పి ఓట్లు అడగగలరా ? అని సవాలు విసిరారు. హత్యలు, మానభంగాలు, అక్రమ మైనింగ్, ఇసుక మాఫియా, గంజాయి అమ్మకాలే జగన్ పాలన అని అన్నారు. అబద్ధాలు చెప్పి ప్రజలను నమ్మించడంలో జగన్‌ది అందివేసిన చేయి అన్నారు. ఈసారి ప్రజల ముందు ఇటువంటి సాగవని అన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, యుడా మాజీ ఛైర్మన్ మధ్యాహ్నపు ఈశ్వరి, బలరామ్, నాయకులు పాల్గొన్నారు.



గొల్లగూడెంలో కూటమి తరపున ప్రచారం చేస్తున్న తెలుగు మహిళలు

ఎన్నికల్లో మహిళాశక్తిని నిరూపించుకోవాలి

▸▸ తెలుగు మహిళా నాయకురాలు ఉన్నమట్ల సునీత

ఉంగుటూరు, ఏప్రిల్ 17: రానున్న ఎన్నికలలో మహిళాశక్తిని నిరూపించుకోవాలని, కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని తెలుగు మహిళా నాయకురాలు ఉన్నమట్ల సునీత కోరారు. బుధవారం ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, ఉంగుటూరు అసెంబ్లీ జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు తరపున తెలుగు మహిళా నాయకులు పాల్గొని సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గంటా ఉషారాణి, చెన్ను సత్యవాణి, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు బొడ్డు శాంతకుమారి, వార్డు సభ్యుడు దాసరి రాజశేఖర్, బోడే సురేష్, జనసేన గ్రామ అధ్యక్షుడు కె.పెద్దిరాజు, సాదే యేసురత్నం, కాళిదాసు రాజు, కె.వంశీ పాల్గొన్నారు. ఉంగుటూరు, చేబ్రోలులలో సర్పంచ్‌లు బండారు సింధు మధు, రాందే లక్ష్మీసునీత, మాజీ సర్పంచి రాందే రాజారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



నల్లగోపువారిగూడెంలో జనసేనలో చేరిన గ్రామస్థులు

జగన్ గద్దె దిగడం ఖాయం

▸▸ కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్

కామవరపుకోట, ఏప్రిల్ 17. ప్రజావ్యతిరేక విధానాలతో నియంతృత్వపాలన కొనసాగిస్తున్న సీఎం జగన్ వచ్చే ఎన్నికల్లో ఓటమితో గద్దె దిగడం ఖాయమని చింతలపూడి నియోజకవర్గ కూటమి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. బుధవాం రాత్రి తూర్పుయడవల్లి పంచాయతీ నల్లగోపువారిగూడెంలో 500 కుటుంబాలు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి చింతలపూడి నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య అధ్యక్షత వహించారు. కూటమి విజయాన్ని ఏ శక్తి ఆపలేదని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గంటా మురళీ, జగ్గవరపు ముత్తారెడ్డి, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు, జనసేన రాష్ట్ర నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మీ, మండల కన్వీనర్ షేక్‌వల్లీ తదితరులు కోలాహలంగా హాజరయ్యారు.

నేడు సర్వోదయ శాంతి ప్రదర్శన

ఏలూరు ఎడ్యుకేషన్/ఉంగుటూరు, ఏప్రిల్ 17 : సమతాభావం, జాతీయ సమైక్యతల చిహ్నమైన ఉంగుటూరు మండలం నాచుగుంటలోని సర్వోదయ స్థూపం వద్ద గురువారం ఉదయం పది గంటలకు సర్వమత ప్రార్థనలు, శాంతి ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు సర్వోదయ మండలి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఓ ప్రకటనలో తెలిపారు. సర్వోదయ కార్యకర్తలు, సేవాతత్పరులు హాజరుకావాలని కోరారు.

క్రైం వార్తలు

మద్యం కల్గి ఉన్న వ్యక్తి అరెస్టు

▸▸ 14 మద్యం బాటిల్స్, కారు సీజ్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 17 : నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిల్స్ కల్గి ఉన్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి 14 మద్యం బాటిల్స్ ఆ బాటిల్స్‌తో ఉన్న కారును సీజ్ చేశారు. కైకలూరు మండలం చెట్టుకాయ గ్రామానికి చెందిన మోరు శ్రీరామకృష్ణ (33) ఇతర రాష్ట్రాలకు చెందిన 14 మద్యం బాటిల్స్‌ను తన కారులో పెట్టుకుని ఏలూరు వస్తున్నాడు. ఆశ్రం ఆసుపత్రి రోడ్డు.. పుచ్చకాలయ రోడ్డు వద్ద ఎస్‌ఈబీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడ్డాడు. రామకృష్ణను అరెస్టు చేసి మద్యం బాటిల్స్‌ను, కారును సీజ్ చేసి కేసు నమోదు చేశామని అధికారులు తెలిపారు.

ఆగిన లారీని ఢీకొట్టిన ఆటో

▸▸ ఆటో డ్రైవర్‌కు గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స



గాయాలపాలైన ఆటో డ్రైవర్ నాగు

జీలుగుమిల్లి, ఏప్రిల్ 17 : రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఆగి ఉన్న లారీ ఢీకొన్న సంఘటన జీలుగుమిల్లి శివారు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బుధవారం జరిగింది. జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరానికి చెందిన గొడ్డాటి నాగు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జీలుగుమిల్లి నుంచి దర్బగూడెం మీదుగా ఇంటికి వెళుతుండగా బుధవారం రాత్రి జీలుగుమిల్లి సమీప సబ్ స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని చీకట్లో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు, మెడ వద్ద తీవ్ర గాయమైంది. అతడికి జీలుగుమిల్లి పీహెచ్‌సీలో మెడ వద్ద నాల్గు కుట్లు వేసి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో చీకట్లో ఓ హోటల్ నిర్వహిస్తుండడం తరచూ అక్కడ ప్రమాదాలు జరగడం, ఆ ప్రాంతం బ్లాక్ స్పాట్‌గా పోలీసులు గుర్తించి చర్యలు తీసుకోవాలని సమీప గ్రామాల వారు కోరుతున్నారు.



ఏలూరులో ప్రసాదం పంపిణీ చేస్తున్న పుట్టా మహేష్‌యాదవ్..అమీనాపేట కల్యాణ మహోత్సవంలో ఏఆర్ ఏఎస్పీ దంపతులు..అశోకనగర్‌లో అన్నదానం.. జంగారెడ్డిగూడెంలో కల్యాణం.. సోమవరప్పాడులో చింతమనేని పూజలు

వైభవంగా రాములోరి కల్యాణం

మార్మోగిన శ్రీరామ నామస్మరణ

జిల్లావ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. ఆలయాల్లో జైశ్రీరామ్ నినాదాలు మార్మోగాయి. శ్రీరామనవమి పురస్కరించుకుని రామాలయాలను సుందరంగా అలంకరించారు. భక్తుల కోసం చలువ పందిళ్లను ఏర్పాటుచేసి వైభవంగా రాములోరి కల్యాణం నిర్వహించారు.

ఏలూరు కల్చరల్/ఏలూరు కార్పొరేషన్/ఏలూరు టూటౌన్/ఏలూరు క్రైం/ఏలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరం, మండలంలోని పాలగూడెం, చాటపర్రు, జాలిపూడి, శ్రీపర్రు, శనివారపుపేట లోని అభయాంజనేయస్వామి, రావిచెట్టు ఆంజనేయస్వామి, రాజయ్య ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. నగరంలోని అంబికాదేవి ఆలయం వద్ద భక్తులు పూజలు చేశారు. అగ్రహారంలోని శ్రీరామ మందిరం, గాంధీనగర్‌లోని చినభద్రాద్రి అని పిలువబడే రామమందిరం తోపాటు ఆంజనేయస్వామి ఆలయాల వద్ద కల్యాణాలు జరిగాయి. ఏలూరు నగరంలో జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాల్లో ఉమ్మడి కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. స్వామిని సందర్శించి పూజలు చేశారు. భక్తులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపి ప్రసాదం అందించారు. శనివారపుపేటలో సీతారామస్వామి దేవస్థానంలో జరిగిన నవమి వేడుకల్లోనూ పూజా కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. ఏలూరు అమీనాపేటలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో 89వ సీతారాముల కల్యాణ మహోత్సవం ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్ దంపతులు పోలీసు బృందాలతో కలిసి నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు ఏఆర్ఆర్ఐ పవన్‌కుమార్, కమిటీ అధ్యక్షులు ఎఆర్ఆర్ఎస్ఐ భాస్కరరావు, ఏఆర్ఎస్ఐ పి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు/పెదవేగి/పెదపాడు : దెందులూరు మండలం సోమవరప్పాడులో దెందులూరు మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఉమ్మడి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ సీతారాముల కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతునూరులోని పాతూరు రామాలయంలో వ్యాపారవేత్త దోనేపూడి రాంబాబు, నున్న నరేష్ దంపతులు పీటలపై కుర్చుని సీతారామల కల్యాణం నిర్వహించారు, చింతమనేని ప్రభాకర్ సతీమణి రాధమ్మ, కుమర్తె నవ్య, టీడీపీ మండల అధ్యక్షుడు మిల్లుబాబు, బీసీ మండల సెల్ అధ్యక్షుడు నున్న లక్ష్మణ్ బాబు, భక్తులు పాల్గొన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలో జరిగిన కల్యాణ వేడుకలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పూజలు నిర్వహించారు. పెదపాడు మండలం అప్పనవీడులోని అభయాంజనేయస్వామి దేవాలయ ఆవరణలో, పెదపాడులోని వీరాంజనేయస్వామి దేవాలయం వద్ద, వట్లూరులోని రామాలయం వద్ద స్వామి వారి కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. వట్లూరులో జరిగిన నవమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొని పూజలు నిర్వహించారు.

● బుట్టాయగూడెం/లింగపాలెం/కామవరపుకోట : జంగారెడ్డిగూడెం పట్టణంలోని సీతారామస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెం భగవాన్ గొలగమూడి వెంకయ్య స్వామి క్షేత్రంలో శ్రీరామనవమి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. పాలకోడేరుకు చెందిన కునాధరాజు అర్జునరాజు, పార్వతి దంపతులు స్వామి వారి దేవస్థానంలో నిత్య అన్నదానంకు రూ.లక్ష అందజేసినట్టు ఈవో కొండలరావు తెలిపారు. మతసామరస్యానికి ప్రతీకగా జంగారెడ్డిగూడెంలోని జేపీ సెంటర్లో జేపీయూత్ అసోసియేషన్ నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాలలో ముస్లింలు పాల్గొని హిందూ సోదరులకి సంఘీభావం తెలిపారు. భక్తులకు పానకం, పులిహోర, వడపప్పు ప్రసాదంగా అందించారు. లింగపాలెం మండలంలోని లింగపాలెంలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ పూజలు నిర్వహించారు. రెండో అన్నవరంగా భావించే రంగాపురంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కామవరపుకోట మండలం జీలకర్రగూడెం లోని రామాలయం వద్ద జమిందారు రాజారాఘవరాజు సుబ్బరాజు కుటుంబసభ్యులు కల్యాణం నిర్వహించారు.

● పోలవరం/బుట్టాయగూడెం/టి.నరసాపురం/జీలుగుమిల్లి : పోలవరం మండలంలో గూటాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం కోదండ రామాలయం, కొత్తపట్టిసీమ రామాలయం, పట్టిసీమ రామాలయం తదితర గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. బుట్టాయగూడెం మండలం దుద్దుకూరు రామాలయంలో జరిగిన నవమి వేడుకల్లో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు. వీరభద్రపురం గిరిజన గ్రామంలో పానకానికి అవసరమైన బెల్లం, మిరియాలు తదితరాలను తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి వితరణ చేశారు. టి.నరసాపురం మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జీలుగుమిల్లి మండలం జీలుగుమిల్లి కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం అర్చకులు తనికెళ్ల రామకృష్ణశర్మ, రవిశర్మ శాస్త్రోక్తంగా జరిపించారు.

● ఉంగుటూరు/భీమడోలు/ఉంగుటూరు మండలంలోని పలు గ్రామాల్లో వున్న రామాలయాలు, భీమడోలు మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి. భీమడోలు, సూరప్పగూడెం, ద్వారకానగర్ తదితర ప్రాంతాల్లోని రామాలయాలను గన్ని వీరాంజనేయులు సందర్శించి పూజలు నిర్వహించారు.

● కుక్కునూరు : కుక్కునూరు మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా చలవు పందెళ్లు ఏర్పాటు చేసి సీతారాముల కల్యాణం జరిపించారు.

● గణపవరం : గణపవరం మండలం సరిపల్లెలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీగాయిత్రీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.



సీతారాములకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న తపనా చౌదరి దంపతులు

● చింతలపూడి, ఏప్రిల్ 17: చింతలపూడి మారుతినగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయంలో కూటమి ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ పూజలు చేసి కొద్దిసేపు అన్నసమారాధనలో పాల్గొన్నారు. యర్రగుంటపల్లి సమీపంలోని రామునిగట్టు వద్ద రామరామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన సీతారామకల్యాణోత్సవానికి బీజేపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. సినీపాటల రచయిత అనంతశ్రీరామ్, భక్తులు పాల్గొన్నారు.



శ్రీవారితో పాటు రాముడి కల్యాణం

కమనీయం.. క్షేత్రపురవీధుల్లో తిరువీధిసేవ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 17: ద్వారకాతిరుమలలో సీతారామచంద్రస్వామి, లక్ష్మణ హనుమాన్ సమేతంగా శ్రీవారి క్షేత్ర తిరువీధిలో ఊరేగారు. శ్రీరామనవమి పురస్కరించుకుని చినవెంకన్న క్షేత్ర పురవీధుల్లో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయులకు ఉదయం, రాత్రి జరిగిన తిరువీధి సేవలు భక్తులకు నేత్రపర్వమయ్యాయి. కోవెల ఆవరణ నుంచి రాజగోపురం మీదుగా తిరువీధుల్లో ఊరేగించారు.

● చిన్నతిరుమలేశుని క్షేత్రంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా రాములోరి కల్యాణాన్ని శ్రీవారి నిత్యకల్యాణంతో పాటుగా బుధవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. నిత్యకల్యాణ మండప వేదిక వద్దకు స్వామి, అమ్మవార్లతో పాటు సీతారాముల కల్యాణ మూర్తులను తెచ్చి కల్యాణ తంతు ప్రారంభించారు. శుభ ముహూర్త సమయంలో మాంగల్యధారణ భక్తుల గోవింద, శ్రీరామనామ స్మరణల నడుమ ఘనంగా జరిగింది.



ఏలూరులో మాట్లాడుతున్న బడేటి చంటి.. పిప్పరలో ఓట్లు అభ్యర్థిస్తున్న పత్సమట్ల ధర్మరాజు.. విజయరాయిలో టీడీపీ నాయకుల ప్రచారం

కూటమి విజయం తథ్యం

▸▸ ఏలూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 17: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి రానున్న ఎన్నికల్లో విజయం తథ్యమని ఏలూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ఏలూరు పవర్‌పేట టీడీపీ కార్యాలయంలో మెగా అభిమానులతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ మూడు పార్టీలు కూటమిగా ఏర్పడటానికి ప్రధాన కారణం పవన్‌కల్యాణ్ అని అన్నారు. మెగా అభిమానులంతా కూటమి అభ్యర్థులకు సంపూర్ణమద్దతు తెలపాలని కోరారు. జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ గతాన్ని పక్కనపెట్టి మెగా అభిమానులంతా చంటి విజయానికి కృషి చేయాలన్నారు. టీడీపీ నాయకులు మధ్యాహ్నపు బలరామ్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మరడాని రంగారావు కాలనీలో ఉన్న సీతారామాంజనేయస్వామి దేవాలయంలో బడేటి చంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మూడు పార్టీల కలయిక విజయానికి స్ఫూర్తి : పత్సమట్ల

గణపవరం/భీమడోలు, ఏప్రిల్ 17: అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలంటే కూటమి వల్లే సాధ్యమని ఉంగుటూరు జనసేన ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం గణపవరం మండలం పిప్పర, భీమడోలు మండలం కురెళ్లగూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిని చేయాలని, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆశయం మేరకు రాష్ట్రం నుంచి వైసీపీని తరిమి కొట్టాలన్నారు. గణపవరంలో టీడీపీ నాయకులు గన్ని నాగగోపాలరావు, ఇందుకూరి రామకృష్ణంరాజు, అద్దేపల్లి వాసు రాజు, కూసంపూడి సురేంద్రకుమార రాజు, యాళ్ళ సుబ్బారావు, కొప్పిశెట్టి ఏసుబాబు, జనసేన నాయకులు తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి గెలుపుతోనే రాష్ట్రప్రగతి : రాంబాబు

పెదవేగి, ఏప్రిల్ 17 : ఎన్డీయే కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్ర ప్రగతి ఆధారపడి ఉందని టీడీపీ నాయకుడు పెదర్ల రాంబాబు అన్నారు. విజయరాయిలో టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి, ఓట్లను అభ్యర్థించారు. రాంబాబు మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలన అంతా అబద్ధాలమయమన్నారు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఐదేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. పార్టీ నాయకులు రావిపాటి పిచ్చియ్యచౌదరి. దారిబోయిన సత్యనారాయణ, బిర్లంగి పెద్దులు, పెదర్ల నాని, మంత్రి శ్రీను, వీరంకి నాగరాజు, మాసాబత్తుల నాగరాజు, దుక్కిపాటి విజయకుమార్, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులను అణచివేసిన జగన్ : ఎంబీఎస్ శర్మ

ఏలూరుటూటౌన్ : ఐదేళ్ల జగన్ పాలనలో బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని అన్నివిధాల అణచివేశారని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ ఎంబీఎస్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వచ్చే సమయానికి జగన్‌కు బ్రాహ్మణులు గుర్తొస్తారా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో దేవాలయాలపై, పూజారులపై, అర్చకులపై దాడులు జరిగినప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలోనే బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి పదకొండు పథకాలు అమలు చేశారన్నారు. బ్రాహ్మణుల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు.

ముండూరులో 'ఇండియా కూటమి' ప్రచారం



ఐక్యత చాటుతున్న ఇండియా కూటమి నాయకులు

పెదవేగి, ఏప్రిల్ 17 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు కె.శ్రీనివాస్ అన్నారు. దెందులూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తిని గెలిపించాలని కోరుతూ ముండూరులో బుధవారం ఇండియా కూటమి విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను ఎంపీ, ఎమ్మెల్యే గెలిపించుకుంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని, తద్వారా రాష్ట్రం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తి, సీపీఎం నాయకులు మావూరి శ్రీనివాసరావు, పలువురు కాంగ్రెస్, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తామరకొల్లులో వైసీపీకి షాక్

▸▸ టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీటీసీ గాంధీ

కైకలూరు, ఏప్రిల్ 17: కైకలూరు నియోజకవర్గంలో ప్రతి రోజూ వైసీపీ నుంచి కూటమిలోకి వలసలు సాగుతున్నాయి. బుధవారం కామినేని స్వగ్రామం వరహాపట్నంలో వైసీపీ ఎంపీటీసీ పందు గాంధీ కామినేని సమక్షంలో టీడీపీలో చేరారు. తామరకొల్లుకు చెందిన వైసీపీ నాయకులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షురాలు చేబోయిన కరుణకుమారి, చేబోయిన శ్రీనివాసరావు, బోడావుల రాజు, బోడావుల నరసింహారావు, బోడావుల నాగరాజు, శేషం గంగయ్య, కళాధర సుధీర్, ఈదా వెంకట్రావుతో పాటు 50 మంది కామినేని ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు. ఆటపాక శివారు జానోపేటకు చెందిన వైసీపీ దళిత నాయ కుడు పిల్లనగ్రోవి రఫాయిల్ కూటమిలో చేరారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ ప్రజలకు సుపరిపాలన అందించే నాయకుల పట్ల ప్రజలు మక్కువ చూపుతారని సమాజానికి మంచి చేసే పార్టీలను గుర్తించి వీరంతా వైసీపీను వీడి కూటమిలో చేరడం అభినందనీయమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, టీడీపీ యాదవ సాధికార సమితి సభ్యుడు గంగుల ఏసురాజు, టీడీపీ నేతలు నున్న కొండా, బూరుబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతి ఉత్సవాల రాట ముహూర్తం

పెదపాడు, ఏప్రిల్ 17:అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి వారి జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం ఉదయం రాట కర్ర వేయు కార్యక్రమం వేదపండితులు, భక్తుల సమక్షంలో నిర్వహిస్తామని ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. స్వామివారి భక్తులు రాటకర్ర ముహూర్తం కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

'తెలుగు నాటక రంగం ఒక అద్భుతలోకం'



విజయ్‌కుమార్‌ను సత్కరించిన స్నేహం అసోసియేషన్ సభ్యులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 17: 'తెలుగు నాటక రంగం ఒక అద్భుతలోకం.. సుసంపన్న సంప్రదా యం.. తెలుగు ప్రజలకు వినోదం.. విద్య సామాజిక స్పృహ అందించింది నాటకం ఒక శక్తివంతమైన సాధనం' అని ఏలూరు స్నేహం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అంబికా రాజా అన్నారు. బుధవారం తెలుగు నాటకరంగ దినోత్స వాన్ని పురస్కరించుకుని స్నేహం అసోసియేషన్ ఆధ్వర్యంలో పవర్‌పేటలోని స్నేహం భవనంలో ప్రముఖరంగస్థల, సినీనటుడు లక్ష్మీఎన్టీఆర్, యాత్ర సినిమాల ఫేమ్ పి.విజయ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అంబికా రాజా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగునాటక రంగం కొత్త సవాల్‌ను ఎదుర్కొంటోందన్నారు. ఈక్రమంలో చాలామంది నాటక కళాకారులు ఈ కళను జీవంగా ఉంచడానికి కృషిచేయటం అభినందనీయమన్నారు. రంగస్థల నటీనటులు టి.విశ్వేశ్వరరావు, భాస్కర్‌రావు, రమ్యకృష్ణ, బేతా కోటేశ్వరరావు, ఎస్‌కే హమీద్, పోలిశెట్టి గంగరాజు, స్నేహం సభ్యులు, అంబికా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం, ఏప్రిల్ 17 : 33/11కేవీ రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ ఫీడర్‌కు గురువారం ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ సరఫరా ఉండదని నియోగదారులు సహకరించాలని కోరారు.

లయన్స్ క్లబ్ కృత్రిమ కాళ్ళ వితరణ



ఆగిరిపల్లి, ఏప్రిల్ 17: తోట పల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో లయన్స్ క్లబ్ 316-డి విజయవాడ ఆర్థిక సాయంతో ఇద్దరికి కృత్రిమకాళ్ళు అందజేశారు. లయన్స్ క్లబ్ కృష్ణాజిల్లా నూతన గవర్నర్ గద్దె శేషగిరి రావు మాట్లాడుతూ దివ్యాంగుల కు సహాయం చేయటం సమాజ కర్తవ్యమన్నారు. కృష్ణా జిల్లా నందిగామకు చెందిన పారా నరసింహారావు, విజయవాడ ప్రసాదంపాడుకు చెందిన కొలసాని వీరబాబుకు కృత్రిమకాళ్ళు అందజేశారు. లయన్స్ క్లబ్ కృత్రిమ అవయవ విభాగం కోఆర్డినేటర్ జె.శ్రీరామ్ పవన్, సూరపనేని కన్‌స్ట్రక్షన్స్ అధినేత సూరపనేని జనార్దన్‌రావు, లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ శివశంకర్, జలచంద్రరావు, హీల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆయుష్ ఉచిత వైద్యశిబిరం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 :మూత్రపిండ సంబంధిత రుగ్మతల బాధితుల కోసం గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏలూరు ఎన్.ఆర్.పేటలోని ఉషాబాల కాంప్లెక్స్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఆయుష్ హాస్పిటల్స్, ఉషా గ్రూప్స్ ఛైర్మన్ డాక్టర్ వి.వి. బాలకృష్ణారావు ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ నల్లమోతు ప్రవీణ్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ భానుకిరణ్ వైద్య శిబిరంలో పాల్గొంటారన్నారు. ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి మందులు ఇస్తారని, వివరాలకు ఫోన్ నంబర్లు 90595 72676, 78938 39452లలో సంప్రదించాలని కోరారు.

ఇంటర్‌లో కైకరం విద్యార్థి స్టేట్ సెకండ్



అజయ్‌రాజు (ఫైల్)

ఉంగుటూరు, ఏప్రిల్ 17 :నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో జిల్లా టాప్ ర్యాంకు సాధించిన హనుమంతు అజయ్‌రాజుకు రాష్ట్రస్థాయి ద్వితీయ ర్యాంకు వచ్చిందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.వి.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

సత్యసాయి చలివేంద్రం ప్రారంభం



ఏలూరులో సత్యసాయి సేవాసంస్థ వారు ప్రారంభిస్తున్న చలివేంద్రం

ఏలూరు కార్పొరే షన్, ఏప్రి ల్ 17 : స్థానిక కెనాల్ రోడ్‌లో బుధవారం శ్రీసత్యసాయి సేవాసంస్థ వారు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశిశేఖరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తాపం తగ్గేవరకు నిరంతరం ఈ చలివేంద్రం ద్వారా తమ సంస్థ సభ్యులు దాహార్తి తీర్చేందుకు పానీయాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో పయిడేటి రామారావు, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట బస్టాండ్‌లో చలివేంద్రం



కొత్తూరు బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గోపాలరావు

కామవరపుకోట, ఏప్రిల్ 17.వేసవి తాపం రోజురోజుకు పెరగటంతో స్థానిక పంచాయితీలోని కొత్తూరు బస్టాండు ఆవరణలో బుధవారం ఆర్యవైశ్యసంఘం నాయకులు కాకిగోపాలరావు, కాకినారాయణరావులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు







అటపాక రోడ్‌సైడ్ రామాలయంలో కల్యాణం

జానకి దోసిట కెంపుల ప్రోవై..

- వైభవంగా సీతారాముల కల్యాణం
- రామాలయాలకు పోటెత్తిన భక్తులు.. ఘనంగా ఉత్సవాలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 17: శ్రీరామనవమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. వాడవాడలా చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణం జరిపారు. నూజివీడు మండలం దిగవల్లి, తూర్పుదిగవల్లి, నూజివీడు కోదండ రామాలయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అన్నసమారాధనలు జరిగాయి. నూజివీడు మండలం గొల్లపల్లిలోని ప్రసిద్ధ యదుపురి రఘునాథస్వామి ఆలయంలో బుధవారం స్వామివారు పెండ్లికుమారుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. రఘునాథస్వామి కల్యాణోత్స వాల్లో భాగంగా స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. కల్యాణం ఈ నెల 20న కల్యాణం నిర్వహిస్తారు.

చాట్రాయి: చాట్రాయి సెంటర్‌లోని రామాలయంలో వందలాది మంది భక్తుల సమక్షంలో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. బూరుగ్గూడెం రామాలయంలో రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి దంపతులు కల్యాణం జరిపించారు.

ముసునూరు: ముసునూరు ఆర్యవైశ్య రామమందిరంలో ఆలయ అర్చకులు వేదాంతం లక్ష్మీనరసింహాచార్యుల ఆధ్వర్యంలో దేవరపల్లి అవినాష్, పడమట రామాలయంలో తలకొండ మధుసూదనరావు, గుడిపాడు కోదండ రామాలయంలో గద్దె రఘుబాబు, మందలపు కిరణ్, మందలపు శ్రీనివాసరావు దంపతులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నసమారాధనలు, గ్రామోత్సవం జరిగాయి.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి చిన్నబజారులో గల కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. ఆగిరిపల్లి పొగడచెట్ల మండపం వద్ద ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవానికి భక్తులు పోటెత్తారు. వట్టిగుడిపాడు సెంటర్లో గల రామాలయంలో జరిగిన కల్యాణానికి సింగనపూడి శ్రీనివాసరావు, తిరుమలశెట్టి రాజు దంపతులు కైంకర్యపరులుగా పాల్గొన్నారు.

కైకలూరు: కైకలూరు వెలమపేట, కుమ్మరివీధి, కాపులబజారు, రైల్వేస్టేషన్ వద్ద, ఎన్జీవోస్ కాలనీలోని రామకృష్ణ సేవాసమితిలో, వార్లకోడు వెంబడి ముఠావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, చిన్నచెరువుగట్టుపై గల రామాలయంలో స్వామివారి కల్యాణాలు జరిగాయి. అటపాక రోడ్‌సైడ్ రామాలయం, శ్రీరామాలయానికి భారీగా భక్తులు పాల్గొన్నారు. అటపాక, కైకలూరులోని పలు రామాలయాల్లో కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పూజలు చేశారు. మండలంలోని భుజబలపట్నం, పల్లెవాడ, ఆలపాడు, దొడ్డిపట్ల, సీతనపల్లి, వరహాపట్నం, తామరకొల్లు, వేమవరప్పాడు తదితర గ్రామాల్లో నవమిని ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో అన్నసమారాధన జరిగింది.

కలిదిండి: తాడినాడ రామాలయంలో బుధవారం ఆలయ చైర్మన్ అల్లూరి శివాజీ దంపతులతో పండితులు సీతారాముల కల్యాణం చేయించారు. భారీ అన్నసమారాధన జరిగింది. ఈవో శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కోరుకొల్లు రామాలయంలో కల్యాణానికి కామినేని శ్రీనివాస్ హాజరయ్యారు.

మండవల్లి: మండలంలోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. పలు చోట్ల కల్యాణం అనంతరం స్వామివారి ఊరేగింపు, అన్నసమారాధనలు జరిగాయి.

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం బావాజీ మఠంలోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది. పెద్దగొన్నూరు, ఉప్పరగూడెం, వైవాక, ఊటుకూరు, నారాయణపురం, బొమ్మినంపాడు, అల్లూరు, వడాలి, ముదినేపల్లి, గురజ, పెదపాలపర్రు తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.



ముదినేపల్లి రూరల్ మండలంలో..



తాడినాడలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



కరుణకుమారికి టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న కామినేని

తామరకొల్లులో వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీటీసీ గాంధీ

కైకలూరు, ఏప్రిల్ 17: కైకలూరు నియోజకవర్గంలో ప్రతి రోజూ వైసీపీ నుంచి కూటమిలోకి వలసలు సాగుతున్నాయి. బుధవారం కామినేని స్వగ్రామం వరహాపట్నంలో వైసీపీ ఎంపీటీసీ పందు గాంధీ కామినేని సమక్షంలో టీడీపీలో చేరారు. తామరకొల్లుకు చెందిన వైసీపీ నాయకులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షురాలు చేబోయిన కరుణకుమారి, చేబోయిన శ్రీనివాసరావు, బోడావుల రాజు, బోడావుల నరసింహారావు, బోడావుల నాగరాజు, శేషం గంగయ్య, కళాధర సుధీర్, ఈదా వెంకట్రావుతో పాటు 50 మంది కామినేని ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు. అటపాక శివారు జాన్‌పేటకు చెందిన వైసీపీ దళిత నాయకుడు పిల్లనగ్రోవి రఫాయిల్ కూటమిలో చేరారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ ప్రజలకు సుపరిపాలన అందించే నాయకుల పట్ల ప్రజలు మక్కువ చూపుతారని సమాజానికి మంచి చేసే పార్టీలను గుర్తించి వీరంతా వైసీపీను వీడి కూటమిలో చేరడం అభినందనీయమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, టీడీపీ యాదవ సాధికార సమితి సభ్యుడు గంగుల ఏసురాజు, టీడీపీ నేతలు నున్న కొండా, బూరుబోయిన శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కృత్రిమ కాళ్ళ వితరణ



ఆగిరిపల్లి, ఏప్రిల్ 17: తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో లయన్స్ క్లబ్ 316-డి విజయవాడ ఆర్థిక సాయంతో ఇద్దరికి కృత్రిమకాళ్ళు అంద జేశారు. లయన్స్ క్లబ్ కృష్ణాజిల్లా నూతన గవర్నర్ గద్దె శేషగిరి రావు మాట్లాడుతూ దివ్యాంగుల కు సహాయం చేయటం సమాజ కర్తవ్యమన్నారు. కృష్ణా జిల్లా నందిగామకు చెందిన పారా నరసింహారావు, విజయవాడ ప్రసాదంపాడుకు చెందిన కొలసాని వీరబాబుకు కృత్రిమకాళ్ళు అందజేశారు. లయన్స్ క్లబ్ కృత్రిమ అవయవ విభాగం కోఆర్డినేటర్ జె.శ్రీరామ్ పవన్, సూరపనేని కన్‌స్ట్రక్షన్స్ అధినేత సూరపనేని జనార్ధన్‌రావు, లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ శివశంకర్, జలచంద్రరావు, హీల్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

నూజివీడు టౌన్, ఏప్రిల్ 17: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని అగ్నిమాపక సిబ్బంది నూజివీడు పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్‌లలో అవగాహన సదస్సులను నిర్వహించారు. షార్ట్ సర్క్యూట్, గ్యాస్ పైప్‌లైన్‌ల లీక్ వంటి కారణాలతో అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటాయని ఆ పరిస్థితుల్లో కార్బన్ డై ఆక్సైడ్ ఉపయోగించి మంటలను అదుపుచేయడంతో పాటు అపార్ట్‌మెంట్ నుంచి సురక్షితంగా బయటకు వచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఫైర్ ఆఫీసర్ కేవీ విశ్వనాథ్ తెలిపారు. ఎల్ఎఫ్ డి.ముత్తయ్య, పి.పవన్‌బాబు, ఫైర్ సిబ్బంది ప్రసాద్, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.



సూరవరంలో కూటమి అభ్యర్థి పార్థసారథి ప్రచారం

పొగాకు రైతులకు బీమా : పార్థసారథి

ఆగిరిపల్లి, ఏప్రిల్ 17: మండలంలోని సూరవరం, కొమ్మూరు, కృష్ణవరం, నరసింగపాలెం, అమ్మవారిగూడెం గ్రామాల్లో నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి ప్రచారం నిర్వహించారు. కొమ్మూరు వాసులు తాగునీటి సమస్యపై, సూరవరంలో పొగాకు రైతులు తమ కష్టాలు ఏకరువు పెట్టారు. సూరవరం గ్రామ సమీపంలో ఉన్న పట్టిసీమ కాలువ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా గ్రామానికి సాగు, తాగునీటికి ఆటంకం లేకుండా చేస్తానని సారథి హామీ ఇచ్చారు. పొగాకు కార్మికులకు చంద్రబాబు ప్రభుత్వంలో బీమా కల్పిస్తామన్నారు. సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ ఉద్యోగాల భర్తీపైనే తొలి సంతకం చేస్తారన్నారు. బీసీ సెల్ అధ్యక్షుడు అరేపల్లి శ్రీనివాస్, వీరాబత్తిన జోషి, దావీదు, నాగరాజు, చిట్నేని శివరామకృష్ణ, జనసైనికులు పాల్గొన్నారు.

కొలుసు తనయుడి ప్రచారం..

ముసునూరు: చంద్రబాబు పాలనతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని పార్థసారథి తనయుడు నితిన్ కృష్ణ అన్నారు. బుధవారం గుడిపాడులో వివిధ వర్గాల ప్రజలు, యువతతో ఆయన సమావేశాలు నిర్వహించి మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో 30 ఏళ్ళు వెనక్కి వెళ్ళిందని, సంక్షేమం పేరుతో ప్రతిఏటా లబ్ధిదారులను తగ్గించి, కోట్లాది రూపాయలు దోచుకున్నారని, యువతకు ఉపాధి లేకుండా చేశారని ధ్వజమెత్తారు. నూజివీడు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు గద్దె రఘుబాబు, మసిముక్కు సుబ్బారావు, మందలపు ధర్మరాజు, కొల్లి గంగారామ్, కొల్లి కృష్ణయ్య, బోగోలు సత్యనారాయణ తదితరలు పాల్గొన్నారు.



దళితుల శంఖారావంలో మాట్లాడుతున్న కామినేని శ్రీనివాస్

రౌడీయిజం లేకుండా చేస్తా : కామినేని

కైకలూరు, ఏప్రిల్ 17: తనను గెలిపిస్తే కైకలూరులో రౌడీలను జిల్లా నుంచి బహిష్కరిస్తానని కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం కైకలూరులో దళిత శంఖారావం టీడీపీ నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు తేరా రమేష్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఎస్సీ నాయకులు బైక్ ర్యాలీగా తరలివచ్చారు. కామినేని మాట్లాడుతూ నిషేధిత క్యాట్‌ఫిష్ అక్రమ ఎగుమతులు చేసి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కోట్లు గడించారన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి అంబేడ్కర్ విద్యకు పేరు మార్చి జగనన్న విద్యాదీవెనగా మార్చడం దారుణమన్నారు. దళితుల 27 పథకాలను నిర్వీర్యం చేశాడన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కైకలూరు నియోజకవర్గంలో ఎస్సీ ఏరియాల్లో 60 శాతం సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టానని, ప్రస్తుతం ఎమ్మెల్యే 5 శాతం కూడా చేయకుండా గొప్పలు చెబుతున్నారన్నారు. ఇటీవల టీడీపీలో చేరిన కైకలూరు జడ్పీటీసీ కురేళ్ళ బేబి మాట్లాడుతూ సమావేశాలకు పిలవకుండా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తనను అవమానించారన్నారు. కొవ్వూరు టీడీపీ దళిత నాయకుడు ముప్పిడి రాజు మాట్లాడుతూ చంద్రబాబు అమలు చేసిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని నిర్వీర్యం చేసి దళితుల పిల్లలకు కార్పొరేట్ విద్యను జగన్ దూరం చేశాడన్నారు. కూటమి అభ్యర్థులు కామినేని, పుట్టా మహేష్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, బీజేపీ నాయకుడు సీఎల్ వెంకట్రావు, టీడీపీ నాయకుడు కొడాలి వినోద్, కోరుకొల్లు సర్పంచ్ లీలాకనకదుర్గ, ఎస్సీ సెల్ నాయకులు పళ్లెం ఏడుకొండలు, యాళ్ళ కృపారావు, వీరాబత్తిన సుధా, ఈదా వెంకటస్వామీ, వాసిపల్లి సతీష్‌కన్నా, రఫాయిల్, జోసఫ్ తంబి, తదితరులు పాల్గొన్నారు. కైకలూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వర్ణకార సంఘంతో కామినేని ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి వారికి తాను అండగా ఉంటానన్నారు.

ముసునూరులో చలివేంద్రం ప్రారంభం



ముసునూరు, ఏప్రిల్ 17: ముసునూరు రైస్‌మిల్ సెంటర్‌లో టీడీపీ నాయకుడు గారపాటి నరసింహారావు బుధవారం చలి వేంద్రాన్ని ప్రారంభించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. వర్షాకాలం వచ్చే వరకు ఈ చలివేంద్రం కొనసాగుతుందని ఆయన తెలిపారు. ప్రతిఏటా సొంత ఖర్చుతో చలివేంద్రాన్ని నడుతున్న నరసింహారావును పలువురు అభినందించారు. టీడీపీ నాయకులు నక్కా యోహాను, రెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల మార్పు

చాట్రాయి, ఏప్రిల్ 17: మండలంలోని జనార్ధనవరం సబ్ స్టేషన్‌లో ఎక్కువ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున, జనార్ధనవరం, చిత్తపూరు ఆరుగొలనుపేట గ్రామాల్లో గురు, శుక్రువారాల్లో వ్యవసాయ విద్యుత్ రాత్రి సమయాల్లో సరఫరా చేస్తామని ఏఈ సంజయ్ తెలిపారు. ఈ మార్పును రైతులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వేసవి దుక్కులతో భూసారం అభివృద్ధి

కలిదిండి, ఏప్రిల్ 17 : వేసవి దుక్కులతో భూసారం అభివృద్ధి చెందుతుందని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ తెలిపారు. లోతుగా దుక్కి దున్నితే అధిక వర్షాలు పడినప్పుడు సారవంతమైన మట్టి కొట్టుకుపోకుండా ఉంటుందన్నారు. దీంతో భూ సామర్థ్యం పెరిగి క్రిమి కీటకాలు నశిస్తాయని తెలిపారు. భూసార పరీక్షలు చేయించి తగు మోతాదులో ఎరువులను వాడుకోవాలని, ప్రతి మూడేళ్లకోసారి రైతులు తమ భూమిలో మట్టిని తీసుకెళ్లి భూసార పరీక్షలు చేయించాలన్నారు.

నలుగురిపై పీడీ యాక్ట్ నమోదు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 17 : జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో పదే పదే నేరాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను గుర్తించి పీడీ యాక్ట్ నమోదు చేసినట్టు జంగా రెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర తెలిపారు. జంగారెడ్డిగూడెం పోలీసు స్టేషన్‌లో విలేకరులకు బుధవారం వివరాలను వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిలో జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కోడూరి రవితేజ, కోన శ్రీనివాస్ అలియాస్ పెప్సీ నాని, మద్దిపాటి కళ్యాణ్, షేక్ నాగూర్ మీరా వల్లీ అలియాస్ బబ్లూ ఉన్నారు. ఈ నలుగురితో పాటు మరికొంత మంది వ్యక్తులు కలిసి ఈ ఏడాది ఫిబ్రవరి 21న నల్లజర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 3.500 కేజీల బంగారు ఆభరణాలు, కొంత నగదును ఒక బంగారు వ్యాపారిని అడ్డగించి దోచుకున్నారని తెలిపారు. ఈ కేసులో ప్రస్తుతం వీరు ఏలూరు జైలులో రిమాండ్‌లో ఉన్నట్లు తెలిపారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

ఎండైనా తప్పదుగా..

ఎండ మండుతున్నా, వడగాల్పులు వీస్తున్నా పొట్టకూటి కోసం పేదలు పాటు పడాల్సిందే. ముదినేపల్లిలో మిట్ట మధ్యాహ్నం ఎండ వేడిమిని తట్టుకోలేని సమయంలో కూడా తోపుడు బళ్లపై ఐస్ క్రీమ్, చీపుర్లు, వేసవి దుస్తులు అమ్ముతూ కనిపించారు.

-ముదినేపల్లి





